VELTHURU TELUGU DAILY
# వెలుతురు
## తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
గురువారం 14.05.2026
సంపుటి: 07 సంచిక: 340
పేజీలు: 12 వెల: రూ. 5/
Velthuru Newspaper
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH



## రైతులకు శుభ వార్త చెప్పిన మోదీ
2
వరి మద్దతు ధర భారీగా పెంచుతూ మోదీ కాబినెట్ నిర్ణయం



## హిందూ ధర్మం ఒక జీవన విధానం
- సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు
- దీపం వెలిగిస్తే చాలని స్పష్టీకరణ!
- హిందూయిజంపై రాజ్యాంగ ధర్మాసనం కీలక విశ్లేషణ
- మత విశ్వాసాన్ని నిరూపించుకోవడంపై కీలక వ్యాఖ్యలు
- గుడికి వెళ్లాల్సిన అవసరం లేదని వెల్లడి
- గుడిసెలో దీపం వెలిగించుకున్నా సరిపోతుందని వ్యాఖ్య

2



# హైదరాబాద్‌లో ఉబెర్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్
- ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్
- మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలన్న సీఎం
- ముఖ్యమంత్రితో భేWటీ అయిన ఉబెర్ సీఈఓ

హైదరాబాద్, మే 13 (వెలుతురు):

ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు.బుధవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (CEO) దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగాముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా ఖోస్రోషాహి వివరించారు.హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ..మిగతా 10లో



## ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు మంత్రం
- తన కాన్వాయ్‌ను సగానికి తగ్గించుకున్న ప్రధాని మోదీ
- ప్రధాని బాటలోనే ప్రముఖ నేతలు
- పశ్చిమాసియా యుద్ధ మేఘాల నేపథ్యంలో చర్యలు
- దేశవ్యాప్తంగా ఇంధన పొదుపుకు ప్రధాని పిలుపు
- ప్రధాని అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య సగం తగ్గింపు

న్యూఢిల్లీ వెలుతురు మే 13:

ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయంగా ఇంధన ధరలపై పెను ప్రభావాన్ని చూపుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి ఇంధన పొదుపు ఒక్కటే మార్గమని భావించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్వయంగా ఆచరణలో పెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచారు. తన పర్యటనల సమయంలో వినియోగించే భారీ అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను ఏకంగా 50 శాతం మేర తగ్గించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దేశ ప్రజలకు పొదుపు పాఠాలు చెప్పడమే కాకుండా, ..మిగతా 10లో



## తమిళనాడు అసెంబ్లీలో బలపరీక్షనెగ్గిన విజయ్ ప్రభుత్వం..
- గెలుపుపై నమ్మకం లేకపోవడం వల్లనే విజయ్ రెండు చోట్ల పోటీ
- ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తి టీవీకేకు లేదు
- ఉదయనిధి స్టాలిన్ ఘాటు విమర్శలు!

2



## సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా
06
- తప్పుడు పోస్టులు , అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం
- బక్రీద్ సందర్భంగా పకడ్బందీ భద్రతా చర్యలు: డీజీపీ సీవీ ఆనంద్ సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ

## రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే సూచనలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు రావొద్దు
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



06



## సరస్వతి అంత్య పుష్కరాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆహ్వానం
2



## ఎమ్మెల్యే గా 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న హేమంత బిశ్వ శర్మ
2



## విశాఖపట్నం రూపురేఖలు మారుస్తాం
2
- ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం
- అమరావతితో సమానంగా అభివృద్ధి
- రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం
- అనంతపురాన్ని ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళిక
- తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ అభివృద్ధికి కార్యాచరణ
- కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు దిశగా అడుగులు

## పొదుపు సూత్రాలేమో తెలంగాణకు.. నిధులేమో ఏపీకి
- బండి భగీరథ దేశం విడిచి వెళ్లకుండా లుక్‌అవుట్ నోటీసులు జారీ చేయాలి
- బీఆర్ఎస్ సోషల్ మీడియాలో బాధితురాలి ఫోటోలు బయటకు రావడం బాధాకరం
- "పది రూపాయల డైపర్ కూడా లీక్ కావడం లేదు.. కానీ నీట్ పేపర్ లీక్ అవుతోంది"
- కేంద్రం పాలమూరును నిర్లక్ష్యం చేసింది
- కేంద్ర విధానాలపై ఫైర్ అయిన కవిత



06

## గచ్చిబౌలిలో విషాదం.. లిఫ్ట్‌లో చిక్కుకుని చిన్నారి మృతి



06



## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు
- ఆర్బీఐ గవర్నర్ వ్యాఖ్యలతో ఆందోళన
- పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడే అవకాశం
- అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతుండటంపై ఆర్బీఐ ఆందోళన
- చమురు కంపెనీలు ఇప్పటికే భారీ నష్టాలను భరిస్తున్నాయన్న సంజయ్ మల్హోత్రా
- ఇంధన ధరల నియంత్రణ ఎంతకాలం సాధ్యమవుతుందో చెప్పలేమన్న గవర్నర్
- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం

న్యూఢిల్లీ వెలుతురు మే 13:

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చని ఆయన హెచ్చరించారు. స్విట్జర్లాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్థిక సమావేశంలో పాల్గొన్న ..మిగతా 2లో



## కమ్యూనిస్టులను ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దు
- దేశంలో కమ్యూనిస్టుల ప్రాభవం తగ్గిందనడం పొరపాటు
- వారు ఇప్పటికీ సజీవంగానే ఉన్నారు.: పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

06

# హైదరాబాద్‌లో ఉబెర్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)
విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పని చేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు.మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని ఆయన తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.

హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు.శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు.ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (CBO) మధు కన్నన్, ఉబెర్ ఇండియా & సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# రైతులకు శుభ వార్త చెప్పిన మోదీ


న్యూఢిల్లీ మే 13 (వెలుతురు)

: ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి తీపి కబురు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా పంటల కనీస మద్దతు ధర (MSP) పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసింది. రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం సవరించింది. పంట పెట్టుబడి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి కొత్త ధరలను నిర్ణయించారు. సాధారణ వరి రకానికి కనీస మద్దతు ధరను రూ.2,441 గా ఖరారు చేశారు. నాణ్యమైన వరి గ్రేడ్‌ఏ రకానికి మద్దతు ధరను రూ.2,461 గా నిర్ణయించారు. జొన్నలు హైబ్రిడ్ క్వింటాల్‌కు మద్దతు ధర రూ.4,023, మల్దండి జొన్నలు రూ.4,073, సజ్జలు రూ.2,900, రాగులు రూ.5,025, మొక్కజొన్న రూ.2,410, కందులు రూ.8,450, పెసర్లు రూ.8,780, మినప క్వింటాలుకు మద్దతు ధర రూ.8, 200గా నిర్ణయించారు. అదేవిధంగా రాబోయే ఖరీఫ్ పంటల మద్దతు కోసం ప్రభుత్వం ఏకంగా రూ.2.6 లక్షల కోట్లను కేటాయించింది.వ్యవసాయంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కేబినెట్ ప్రాధాన్యం ఇచ్చింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఇంటర్నేషనల్ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో రవాణా, పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కానుంది. పర్యావరణ హితమైన ఇంధన ఉత్పత్తి , విద్యుత్ రంగంలో స్వావలంబన కోసం 'కోల్ గ్యాసిఫికేషన్' పథకానికి కేంద్రం రూ.37,500 కోట్లను కేటాయించింది. దీంతో ఎల్ఎన్‌జీ (LNG) దిగుమతి భారం మరింత తగ్గనుంది. సర్కేజీ ధోలేరా మధ్య సెమి హై స్పీడ్ డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి రూ.20,065 కోట్ల కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# సరస్వతి అంత్య పుష్కరాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆహ్వానం

హైదరాబాద్ వెలుతురు మే 13:

ఈనెల 21 నుండి ప్రారంభమయ్యే సరస్వతి అంత్య పుష్కరాలకు రావాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారిని దేవాదాయ శాఖ అధికారులు,అర్చకులు మంత్రుల నివాస సముదాయంలోనీ మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు.రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంత రావు,అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ శాలువా కప్పి ఆహ్వాన పత్రిక అందజేశారు.గత ఏడాది సరస్వతి పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరైన నేపథ్యంలో...గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరస్వతి అంత్య పుష్కరాలకు రోడ్లు భవనాలు శాఖ తరుపున అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.దేవాదాయ శాఖ అధికారులు..ఆర్ అండ్ బి శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పుష్కరాలను విజయవంతం చేయాలని సూచించారు.రాబోయే గోదావరి పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భక్తుల కోసం ఏర్పాట్లు ప్రారంభించిందని,రోడ్లు భవనాలు శాఖ అధ్వర్యంలో పుష్కర ఘాట్ల నిర్మాణం, రోడ్ కనెక్టివిటీ లాంటి భక్తుల సౌకర్యాలపై ప్రధాన దృష్టి సారించినట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.



# ఎమ్మెల్యే గా 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న హేమంత బిశ్వ శర్మ

గువాహటి, వెలుతురు మే 13:

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ జలుక్బారి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రజాప్రతినిధిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రయాణాన్ని ఆయన "అనంత సేవ"గా అభివర్ణించారు. 2001లో ఇదే రోజున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన శర్మ, అప్పటి నుంచి వరుసగా ఆరు సార్లు గెలిచినట్లు చెప్పారు. జలుక్బారి ప్రజల ఆశీర్వాదం వల్లే ఇది సాధ్యమైందని, వారికి సేవ చేయడం తనకు గొప్ప గౌరవమని అన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఎప్పటికీ కృషి చేస్తానని ఆయన తెలిపారు. అస్సాంను మరింత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చేందుకు, దేశ ప్రగతికి తోడ్పడేందుకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. 1996లో తొలి సారి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన శర్మ, 2001 నుంచి జలుక్బారి సీటును నిరంతరం కాపాడుకుంటూ వస్తున్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు మంత్రం

(మొదటి పేజీ తరువాయి)
తానే ముందుండి ఆ మార్పును ప్రారంభించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రధాని భద్రతను పర్యవేక్షించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ) ఇప్పటికే ఈ మార్పులపై కసరత్తు పూర్తి చేసింది. భద్రతా పరమైన ప్రోటోకాల్స్‌లో ఎక్కడా రాజీ పడకుండానే, వాహనాల సంఖ్యను తగ్గించి, అందుబాటులో ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలను ఎక్కువగా వినియోగించాలని ప్రధాని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొత్త వాహనాల కొనుగోలుకు స్వస్తి పలికి, వనరులను పొదుపుగా వాడుకోవడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రధాని మోదీ తీసుకున్న ఈ సంచలన నిర్ణయం కేంద్ర మంత్రుల్లో, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో కొత్త స్ఫూర్తిని నింపింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే తన కాన్వాయ్‌ను సగానికి పైగా తగ్గించుకోగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తన కాన్వాయ్‌లోని వాహనాలను 13 నుంచి 8కి పరిమితం చేశారు. అటు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా ప్రభుత్వ యంత్రాంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రజా నిధులు విలాసాల కోసం కాదని, అవి ప్రజల అభివృద్ధి కోసం మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు ఒకే సమావేశానికి వెళ్లేటప్పుడు వేర్వేరు వాహనాలు కాకుండా కార్‌పూలింగ్ పద్ధతిని అనుసరించాలని, వీలైనంత వరకు ఢిల్లీ మెట్రో లేదా ఇతర ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించాలని ఆమె ఆదేశించారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడమే కాకుండా, రోడ్లపై వాహనాల రద్దీ తగ్గి కర్బన ఉద్గారాలు నియంత్రణలోకి వస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వీఐపీల రాకపోకల వల్ల గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లలో ఇరుక్కుపోయే సామాన్య ప్రజలకు కూడా ఈ నిర్ణయంతో పెద్ద ఉపశమనం లభించనుంది. కేవలం ఇంధనం మాత్రమే కాకుండా, విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకునే ప్రతి వస్తువుపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ప్రధాని మోదీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వంటనూనె, బంగారం, రసాయన ఎరువుల దిగుమతుల కోసం దేశం భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబం తమ వంటనూనె వినియోగాన్ని స్వల్పంగా తగ్గించినా అది దేశ ఆర్థిక వ్యవస్థకు గొప్ప ఊతమిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు నిలిపివేయాలని కోరడం ద్వారా దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. రైతులు కూడా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, ఖర్చు తక్కువతో కూడిన సహజ వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటమే కాదని, బాధ్యతాయుతమైన పౌరులుగా దేశ వనరులను కాపాడుకోవడమే నిజమైన దేశభక్తి అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములైతేనే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న ఈ పొదుపు మంత్రం కేవలం ప్రభుత్వానికే పరిమితం కాకుండా ఒక సామాజిక ఉద్యమంగా మారుతోంది. ప్రభుత్వ శాఖల్లోని వాహనాల వినియోగాన్ని తక్షణమే సమీక్షించాలని ఇప్పటికే ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అధికారులను ఆదేశించారు. విదేశీ ఎగుమతులు, దిగుమతులపై ప్రపంచ వ్యాప్తంగా అంతరాయాలు కలుగుతున్న వేళ, స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా అడుగులు వేయాలని కేంద్రం భావిస్తోంది. రోడ్లపై ప్రభుత్వ వాహనాల సంఖ్య తగ్గడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రజల ప్రయాణాలు సులభతరం కావడం మరో సానుకూల అంశం. 'తగ్గించుకుందాం దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో సాగుతున్న ఈ ప్రయాణం సామాన్య ప్రజలను కూడా పొదుపు దిశగా ఆలోచింపజేస్తోంది. ప్రధాని నుంచి సామాన్య పౌరుడి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే, అంతర్జాతీయ ఒత్తిళ్ల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థను సులభంగా గట్టెక్కించవచ్చని ఈ చర్యలు నిరూపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని రాష్ట్రాలు ఇదే బాటలో నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# హిందూ ధర్మం ఒక జీవన విధానం

ఢిల్లీ వెలుతురు మే 13:

హిందూ ధర్మం అనేది కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, అది ఒక గొప్ప జీవన విధానమని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు మరోసారి చాటి చెప్పింది. మతపరమైన విశ్వాసాలు, ఆచారాల పరిధిని నిర్ణయించే క్రమంలో బుధవారం తొమ్మిది మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తి హిందువుగా తన విశ్వాసాన్ని చాటుకోవడానికి తప్పనిసరిగా దేవాలయాలను సందర్శించాల్సిన పనిలేదని, లేదా కఠినమైన ఆచారాలను పాటించాల్సిన అవసరం లేదని న్యాయస్థానం అభిప్రాయపడింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ఈ ధర్మాసనం, కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయ ప్రవేశం మరియు మతపరమైన వివక్షకు సంబంధించిన పిటిషన్లపై విచారణ జరుపుతూ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. హిందూ మతాన్ని అనుసరించే వ్యక్తి తన ఇంట్లో లేదా ఒక చిన్న గుడిసెలో దీపాన్ని వెలిగించుకున్నా, అది అతని అచంచలమైన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని, అంతకంటే మించిన నిరూపణలు అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. శబరిమల ఆలయంలోకి నిర్ణీత వయస్సు గల మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ 2018లో వెలువడిన చారిత్రాత్మక తీర్పుపై దాఖలైన పునస్సమీక్ష పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఈ విచారణలో భాగంగా బుధవారం జరిగిన 15వ రోజు వాదనలలో పలు ఆసక్తికరమైన అంశాలు తెరపైకి వచ్చాయి. మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరపున సీనియర్ న్యాయవాది డాక్టర్ జి. మోహన్ గోపాల్ తన వాదనలను వినిపించారు. 1966లో కోర్టు ఇచ్చిన ఒక తీర్పును ఆయన ఉదహరిస్తూ, వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించేవాడే హిందువు అని నిర్వచించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ సమాజంలో ఉన్న అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే గతంలో ఇటువంటి నిర్ణయాలకు రావడం సరైంది కాదని ఆయన వాదించారు. నేడు హిందువులుగా పిలవబడుతున్న ప్రతి ఒక్కరూ వేదాలనే పరమ ప్రమాణంగా భావిస్తున్నారా? అనే ప్రశ్నను ఆయన ధర్మాసనం ముందుంచారు. సామాజిక న్యాయం కోసం హిందూ మతంలోని అంతర్గత వర్గాల నుంచే డిమాండ్లు వస్తున్నాయని ఆయన సభకు విన్నవించారు. న్యాయవాది మోహన్ గోపాల్ వాదనలపై ధర్మాసనంలోని మహిళా న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న సానుకూలంగా స్పందించారు. అందుకే హిందూ మతాన్ని కేవలం ఒక మతంగా కాకుండా, విశాలమైన 'జీవన విధానంస అని పిలుస్తారని ఆమె పేర్కొన్నారు. ఒక హిందువుగా కొనసాగడానికి గుడికి వెళ్లడం లేదా నిర్దిష్ట ఆచారబద్ధమైన పద్ధతులను అనుసరించడం కచ్చితమైన నిబంధన ఏమీ కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజలు తమ అంతరాత్మలో కలిగి ఉండే విశ్వాసాలను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని, దానికి ఎవరూ అడ్డుపడలేరని ఆమె తేల్చి చెప్పారు. ఇదే క్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ, మత విశ్వాసానికి భౌతికమైన నిరూపణలు అక్కర్లేదని, ఒక సామాన్యుడు తన గుడిసెలో వెలిగించుకునే చిన్న దీపం కూడా ఆ మతం పట్ల అతనికి ఉన్న అంకితభావాన్ని చాటుతుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు హిందూ ధర్మం యొక్క ఉదారతను మరియు వ్యక్తిగత విశ్వాసానికి ఉన్న స్వేచ్ఛను ప్రతిబింబిస్తున్నాయని న్యాయ కోవిదులు భావిస్తున్నారు. ఈ రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్ మరియు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి వంటి ప్రముఖ న్యాయమూర్తులు సభ్యులుగా ఉన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

(మొదటి పేజీ తరువాయి)
సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఆర్బీఐ గవర్నర్, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ వాతావరణం కొనసాగుతుండటం వల్ల అంతర్జాతీయంగా ముడి చమురు సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. ఈ పరిస్థితులు కొనసాగితే చమురు ధరలు మరింత పెరిగే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్ తన ఇంధన అవసరాల్లో పెద్దమొత్తాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటున్న నేపథ్యంలో క్రూడాయిల్ ధరల పెరుగుదల నేరుగా దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతుందని ఆయన వివరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మరియు చమురు మార్కెటింగ్ కంపెనీలు కలిసి వినియోగదారులపై అదనపు భారం పడకుండా ధరలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. అయితే చమురు కంపెనీలు భారీ నష్టాలను భరిస్తూ ఈ విధానాన్ని కొనసాగిస్తున్నాయని, ఇది దీర్ఘకాలం సాధ్యమయ్యే అంశం కాదని స్పష్టం చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించడం ద్వారా కొంత ఉపశమనం కల్పించిందని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఎక్కువకాలం అధిక స్థాయిలో కొనసాగితే ఆ భారం మొత్తాన్ని ప్రభుత్వం భరించడం కష్టమవుతుందని చెప్పారు. ఆ పరిస్థితుల్లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు అనివార్యమయ్యే అవకాశముందని సూచించారు.

ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం రవాణా రంగానికే పరిమితం కాదని ఆర్బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే సరుకు రవాణా ఖర్చులు అధికమవుతాయని, దాంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఫలితంగా దేశంలో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుదల దిశగా వెళ్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ద్రవ్యోల్బణం పెరిగితే రిజర్వ్ బ్యాంక్ తీసుకునే ద్రవ్య విధాన నిర్ణయాలపై కూడా ప్రభావం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వడ్డీ రేట్ల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తొచ్చని సూచించారు. వడ్డీ రేట్లు పెరిగితే గృహ రుణాలు, వాహన రుణాలు, వ్యాపార రుణాలపై అదనపు భారం పడుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. దీంతో వినియోగదారుల ఖర్చులు తగ్గే ప్రమాదం ఉండటంతో పాటు ఆర్థిక వృద్ధి కూడా మందగించే అవకాశముందని విశ్లేషిస్తున్నారు. మరోవైపు విదేశీ మారక నిల్వల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు ప్రారంభించినట్లు ఆర్బీఐ గవర్నర్ వెల్లడించారు. బంగారం, వెండి దిగుమతులపై సుంకాలను 15 శాతానికి పెంచడం ద్వారా అనవసర దిగుమతులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. దీంతో విదేశీ కరెన్సీ వినియోగాన్ని నియంత్రించి రూపాయి మారక విలువను కాపాడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇంధన వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం పిలుపునిస్తున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అవసరం లేని ప్రయాణాలను తగ్గించడం, ప్రజా రవాణాను ఎక్కువగా వినియోగించడం, విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి చర్యల ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించవచ్చని సూచించారు. దీని వల్ల దేశ దిగుమతి వ్యయం కొంత మేర తగ్గే అవకాశం ఉందన్నారు.ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆర్బీఐ గవర్నర్ పేర్కొన్నారు.

# విశాఖపట్నం రూపురేఖలు మారుస్తాం

విశాఖపట్నం వెలుతురు మే 13:

అభివృద్ధి విషయంలో ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టడం లేదని, విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దే దిశగా సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి, వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన రాష్ట్ర అభివృద్ధి దిశ , భవిష్యత్ ప్రణాళికలపై విస్తృతంగా మాట్లాడారు. రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని సీఎం అన్నారు. ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే తమ విధానమని ఆయన స్పష్టం చేశారు. రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాలను ప్రత్యేక హబ్‌లుగా అభివృద్ధి చేస్తూ సమగ్ర ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నట్లు వివరించారు.రాయలసీమను 'రతనాల సీమ'గా మార్చే దిశగా ఇప్పటికే పలు పరిశ్రమలు వస్తున్నాయని సీఎం తెలిపారు. అనంతపురాన్ని ఏరోస్పేస్ హబ్‌గా అభివృద్ధి చేయడమే కాకుండా, తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ ఏర్పాటు చేయడం ద్వారా అధునాతన పరిశ్రమలకు కేంద్రంగా మార్చుతున్నామని చెప్పారు. కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతుందని, ఇది భవిష్యత్ టెక్నాలజీ రంగానికి కీలక కేంద్రంగా మారుతుందని ఆయన అన్నారు. ఇక శ్రీసిటీ ఇప్పటికే దేశంలోనే ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందిందని సీఎం పేర్కొన్నారు. అక్కడ పెట్టుబడులు పెరుగుతున్నాయని, మరిన్ని గ్లోబల్ కంపెనీలు రాబోతున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన అనుమతులు వేగంగా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.రాజధాని ప్రాంత అభివృద్ధిపై మాట్లాడుతూ, కిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. 2027 మే 13 నాటికి ఆసుపత్రిని ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. వైద్య విద్యను మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు వైద్య విశ్వవిద్యాలయం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం అభివృద్ధి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన సీఎం, 2028 ఆగస్టు 15 కంటే ముందే గూగుల్ తన కార్యకలాపాలను ప్రారంభిస్తుందని తెలిపారు. విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దే దిశగా అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకు వస్తున్నాయని ఆయన చెప్పారు. అలాగే ఆర్సెలార్ మిత్తల్ సంస్థ ఫేజ్ 1 పనులను 2028 డిసెంబరు లోపు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.రాష్ట్రంలో నైపుణ్య అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని సీఎం తెలిపారు. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. వైద్యులు కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను నేర్చుకుంటున్నారని, ఇది వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఆంధ్రప్రదేశ్ నుంచే ఉండాలన్నది తమ లక్ష్యమని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని గ్లోబల్ టాలెంట్ హబ్‌గా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు కేంద్రంగా అమరావతి మారుతుందని ఆయన అన్నారు. విద్యుత్, ఎనర్జీ రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని సీఎం తెలిపారు. విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని రాష్ట్రంలోనే పెంచే కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటిపై, ప్రతి పొలంలో సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మారే విధంగా ప్రణాళికలు ఉన్నాయని వివరించారు.పశ్చిమాసియా యుద్ధ పరిణామాల కారణంగా ఇంధన సంక్షోభం ఏర్పడిన నేపథ్యంలో, భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీ అవసరం మరింత పెరుగుతుందని సీఎం అన్నారు. అందుకే రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

# తమిళనాడు అసెంబ్లీలో బలపరీక్ష నెగ్గిన విజయ్ ప్రభుత్వం..

చెన్నై బ్యూరో కరెస్పాండంట్, మే 13 (వెలుతురు):

అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని విజయం, ప్రభుత్వ ఏర్పాటుకు అనేక అవాంతరాల తర్వాత సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నేడు తమిళనాడు అసెంబ్లీలో విజయ్ ప్రభుత్వానికి స్పీకర్ బల పరీక్ష నిర్వహించగా.. విజయ్ ప్రభుత్వంపై ఉదయనిధి స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రజామోదం పొందడంలో టీవీకే విఫలమైందని, 65 శాతం మంది ఓటర్లు విజయ్‌ను తిరస్కరించారని, టీవీకేకు వ్యతిరేకంగా 3.1 కోట్ల మంది ప్రజలు ఓటేశారని అన్నారు. విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు డీఎంకే కూటమిలోని పార్టీలే మద్దతిస్తున్నాయి అన్నది మర్చిపోవద్దని గుర్తు చేశారు. అలాగే టీవీకే అధినేత అయినప్పటికి గెలుపుపై నమ్మకం లేకపోవడం వల్లనే విజయ్ రెండు చోట్ల పోటీ చేశారని, ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తి టీవీకేకు లేదని ఉదయనిధి స్టాలిన్ అసెంబ్లీలో తీవ్ర విమర్శలు చేశారు. ఇదిలా ఉంటే విజయ్ ప్రభుత్వ బలపరీక్ష వేళ తమిళనాడు అసెంబ్లీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. స్పీకర్ ఓట్ల లెక్కింపు ద్వారా ఎమ్మెల్యేల అభిప్రాయ సేకరణ చేపట్టారు. విజయ్‌కు సపోర్ట్‌గా లేచి నిలబడిన ఎమ్మెల్యేలు.. మద్దతిచ్చిన వారి పేర్లను అసెంబ్లీ అధికారులు చదివి వినిపించారు. అంతకు ముందు డీఎంకే, ఏఐడీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేయగా.. ఏఐడీఎంకే రేబల్ వర్గం.. టీవీకే ప్రభుత్వానికి సపోర్ట్ గా నిలిచారు. దీంతో బలపరీక్షలో



విజయకి 144 మంది సభ్యులు మద్దతుగా నిలిచినట్లు స్పీకర్ ప్రకటించారు. అలాగే మరో 22 మంది విజయ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. అయినప్పటికి బలపరీక్ష లో విజయ్ ప్రభుత్వం నెగ్గినట్లు స్పీకర్ ప్రకటించారు.

# సింగోటం - గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులు వేగవంతం చేయాలి

- బొల్లారంలో భూబాధిత రైతులతో మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖాముఖి
- భూ సేకరణకు రైతులు సహకరించాలి
- కెనాల్ లో భూములు కోల్పోతున్న రైతులకు మూడింతల పరిహారం
- పట్టా ఉన్న అసైన్డ్ భూములతో పాటు పట్టా లేని రైతులకు కూడా పరిహారం
- సత్వరమే పరిహారం చెల్లించి పనులు మొదలయ్యేలా చూడాలి
- అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం

కొల్లాపూర్, వెలుతురు మే 13:

సింగోటంగోపాలదిన్నె లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర కంటే మూడింతల పరిహారం అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామంలోని రైతు వేదిక వద్ద సంగినేనిపల్లి, తూముకుంట, బొల్లారం గ్రామాలకు చెందిన భూబాధిత రైతులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమై, వారి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు.

**ఎకరాకు రూ.11.50 లక్షల పరిహారం**

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మార్కెట్ విలువ రూ.1,87,500 తక్కువగా ఉందంటూ రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. బేసిక్ మార్కెట్ విలువను తక్షణమే రెండింతలు పెంచి రూ.3,75,000గా ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పెంచిన విలువ (రూ.3,75,000) ఆధారంగా భూసేకరణ చట్టం ప్రకారం మూడింతల పరిహారంతో పాటు, గెజిట్ ప్రచురించిన నాటి నుంచి వడ్డీని కూడా కలిపి ఎకరాకు మొత్తం రూ.11,50,000 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. తక్షణమే అవార్డు కాపీలు మంజూరు చేసి పరిహార పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యాన్ని మంత్రి ఆదేశించారు.





**అసైన్డ్, పట్టా లేని రైతులకూ సమన్యాయం**

సాధారణ పట్టాదారులతో పాటే అసైన్డ్ పట్టాలు కలిగిన రైతులకు కూడా ఇదే తరహా పరిహారాన్ని వర్తింపజేయాలని బొల్లారం గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకురాగా, దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. అసైన్డ్ పట్టాదారులకు సమాన పరిహారం అందించడంతో పాటు, ఎలాంటి పట్టాలు లేకుండా చాలా కాలంగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు కూడా భూసేకరణ చట్టంలోని ట్రిపుల్ ఆర్ ('3ఆర్) ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**40 వేల ఎకరాలకు సాగునీరు**

కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో జూరాల ప్రాజెక్టు పరిధిలో 25 వేల ఎకరాలు, భీమా ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాలు.. మొత్తం 40 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని మంత్రి జూపల్లి వివరించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికే 2018లో సింగోటంగోపాలదిన్నె లింక్ కెనాల్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. ఈ కెనాల్ నిర్మాణం కోసం మొత్తం 305.23 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు.

**భూసేకరణ వివరాలు:**

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి: 50 ఎకరాలు
వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం: 73 ఎకరాల 13 గుంటలు
వల్లభాపూర్: 87 ఎకరాల 3 గుంటలు
సంగినేనిపల్లి: 94 ఎకరాల 8 గుంటలు

ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా భూసేకరణ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, బొల్లారం, తూముకుంట సర్పంచులు సుదర్శన్ రెడ్డి, రామన్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, చిన్నారెడ్డి, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# బంగారం కొనడం తగ్గించుకోవాలి..

- త్వరలో 'వర్క్ ఫ్రమ్ హోమ్'పై ప్రకటన
- హైదరాబాద్ కంటే మెరుగ్గా అమరావతి
- లక్ష ఉద్యోగాలే లక్ష్యం..
- 'కిమ్స్' సభలో సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు

అమరావతి మే 13 (వెలుతురు):



రాష్ట్ర ప్రజలు బంగారం కొనుగోలును తగ్గించుకోవాలని, ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇస్తున్న సూచనలను అందరూ పాటించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం అమరావతిలోని నిడమర్రులో కిమ్స్ ఆస్పత్రి, బైసర్ స్కిల్ యూనివర్సిటీలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

దేశవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే బంగారంలో సుమారు 50 శాతం వాటా ఒక్క కర్నూలు జిల్లా నుంచే వచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే, విలాసాల కంటే పొదుపుపై దృష్టి సారించాలని కోరారు. 'ప్రస్తుతం కాన్వాయ్ అనేది ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. భద్రత అనేది అర్థవంతంగా ఉండాలి తప్ప, ఆడంబరంగా ఉండకూడదు' అని ఆయన వ్యాఖ్యానించారు. 'వర్క్ ఫ్రమ్ హోమ్ గురించి నేను ఎప్పుడో చెప్పాను, ఇప్పుడు మళ్లీ అదే ట్రెండ్ వస్తోంది. దీనిపై రేపో ఎల్లుండో ప్రభుత్వం తరపున ఒక కీలక ప్రకటన చేయబోతున్నాం' అని ఆయన తెలిపారు. రాజధాని అమరావతి భవిష్యత్తుపై ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. 'నేను తొలిసారి ముఖ్యమంత్రి అయ్యే నాటికి హైదరాబాద్‌లో కనీస వైద్య సదుపాయాలు, ఆస్పత్రులు ఉండేవి కావు. గల్ఫ్ దేశాల్లోని హాస్పిటాలిటీ రంగాన్ని అధ్యయనం చేసి అక్కడ ఎన్నో సంస్కరణలు తెచ్చాను. ఇప్పుడు అమరావతిని హైదరాబాద్ కంటే మెరుగైన నగరంగా తీర్చిదిద్దుతాం. పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి' అని కోరారు.

కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమేనని, లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సీఎం స్పష్టం చేశారు. నిడమర్రులో శంకుస్థాపన చేసిన కిమ్స్ ఆస్పత్రిని 2027 మే 13 నాటికి పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన అనుమతులను ప్రభుత్వం త్వరితగతిన మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, కిమ్స్ ఆస్పత్రి ప్రతినిధులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చరణ్ కౌశిక్ యాదవ్ కు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు

- డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

హైదరాబాద్ వెలుతురు మే 13:

బుధవారం రోజున తెలంగాణ ప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన శ్రీ చరణ్ కౌశిక్ యాదవ్ గారు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారికి హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉంది.

కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తూ, టీపీసీసీ అధికార ప్రతినిధిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించిన బీసీ బిడ్డ అయిన శ్రీ చరణ్ కౌశిక్ యాదవ్ గారి కృషిని గుర్తించి ఈ గౌరవప్రదమైన బాధ్యత అప్పగించిన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి, మంత్రివర్యులు వాకిటి శ్రీహరి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. శ్రీ చరణ్ కౌశిక్ యాదవ్ గారి నాయకత్వంలో తెలంగాణ ప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ మరింత అభివృద్ధి సాధించి, రాష్ట్రంలోని పశుసంవర్ధక రైతులకు ఎంతో ఉపయోగపడే విధంగా పనిచేస్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది.

వారికి ఈ కొత్త బాధ్యతల్లో విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.



# జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలి

## ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డి



- సొసైటీలన్నీ సమిష్టిగా సహకరిచాలి
- మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు మే 13:

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రారంభమైన జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్ లోని మీడియా అకాడమీలో జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపుతోందని అన్నారు. మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈనెల 21న జరుగనున్న కేబినెట్ సమావేశం నాటికి హైదరాబాద్ లో ఉన్న అన్ని సొసైటీల పూర్తి వివరాలను, జర్నలిస్టుల సంఖ్యతో కూడిన నివేదికను తయారు చేయాలని అన్నారు. ఇందుకు అన్ని సొసైటీలు సమిష్టిగా సహకరించాలని ఆయన కోరారు. అర్హులైన జర్నలిస్టులను మాత్రమే జాబితాలో చేర్చాలని ఆయన సొసైటీల ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఈ సొసైటీని కూడా పరిగణలోకి తీసుకొని జేఏసీలో చేర్చారు. అదేవిధంగా మహాత్మగాంధీ జర్నలిస్ట్స్ సొసైటీని కూడా చేర్చారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ లు తమ సొసైటీ సభ్యుల జాబితా ను సమర్పించారు. ఈ సమావేశంలో ఐఅండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# "మేమే దళితులం"

పరుల కోసం ..ప్రగతి కోసం
పరితపించే... దళిత శ్రమ జీవులం!..
కష్టాల కొలిమిలో... నష్టాల అగ్నిలో
నిత్యం కాలుతున్న కార్మికులం
ఆకలితో అలమటించే పేదలం!..
ఎప్పుడు ఇతరుల..
బాగుకొరకు పాటుపడే దళితులం
నష్టమొచ్చిన కష్టమొచ్చినా
ఇష్టంగా పనిచేసే కష్ట జీవులం
చైతన్య ఊపిరే మా నడక
మానవత్వపు జీవనమే మా మనుగడ
తాడిత పీడిత జాతుల్లో ఉన్న
నీతి నియమాలే మా ఖ్యాతి!...

మేము లేనిదే లేదు దేశం
మాతోనే నిండు
అందరిలో సంతోషం
మేము లేనిదె లేదు లోకం
మాతోనే కలుగును స్వర్గలోకం
మమ్మల్ని దూరంచేవారిలో
మానసికంగా కలుగు శోకం!..
మాతోనే కలుగు అందరిలో ..
ఎల్లప్పుడూ శుభ సందేశం!..


అందరికీ కావాలి మాసేవ
కష్టానికి ముందుంచి
కులానికి దురముంచే దుస్థితి!...
కులం చెప్పితే గుండెలో...
ముళ్ళు గుచ్చుకున్నట్లె..
కానీ అందరికి మా చేతలు కావాలి!..
మా చైతన్యం కావాలి...
అయినా దూరంలో ఉంచుతారు!...

మా తోనే విజయ సూచిక
తెలుసుకున్న వారిలో విజయ గీతిక
మేమే వినూత్న ఈ లోకానికి
శుభవీచిక
మాలోని అభ్యుదయ భావాల
పొందిక
అంబేద్కర్ ఆశయల అడుగులలో...
అంబేద్కర్ ఆలోచనల
సహాయకులం!...


మా ఊతమే దేశానికి ఊపిరి!..
సమాజం గుండెలో వెలుగులు..
కల్తీలేని మానవత్వపు వ్యక్తులం!..
అందరిలో ఆత్మీయతను...
పెంచుకున్న దళితులం!..
మాది సాయుధ పోరాటమే!...
గాయమైనా శరీరాలతో నైనా...
మీకు సేవలు చేస్తనే ఉంటాం ..
దళితులమైనా మాలో...
దయాగుణం మాట మర్యాద
ఎక్కువనే!..

మాది దళిత సిద్ధాంతం !...
మేము నమ్మం.. మీ వేదాంతదోరణి
!...
ఎన్ని బాధలైనా బరిస్తాం
పనిచేస్తాం!...
ఉన్నఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టం!...
మా వెన్నంటున్న దళిత ఉద్యమం!..
కొందరు కష్టపెట్టుదురు కాలితో
తన్నుదురు!!...
ఇంకామారలేదు కులాలు మతాలు
పోలేదు
వ్యత్యాసాలు విభేదాలు మనసులో
ఉన్నాయి!..

అంబటి నారాయణ
నిర్మల్
9849326801



# ఐబొమ్మ మళ్లీ వచ్చింది..!




- **కొత్త సినిమాలతో ఇంటర్నెట్‌లో ప్రత్యక్ష్యం**
- **తీవ్ర ఆందోళనలో సినీ నిర్మాతలు**

హైదరాబాద్, మే 13(వెలుతురు):

కొద్ది నెలల క్రితం వరకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఐబొమ్మ చర్చనీయాంశంగా మారింది. ఈ యాప్ నిర్వహకుడు రవిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి అతనితోనే యాప్ ను తొలగించారు. నాటి నుంచి ఇంటర్నెట్ లో ఐబొమ్మ వెబ్ సైట్ కనిపించకుండా పోయింది. అయితే బెయిల్ పై జైలు నుంచి రవి విడుదలైన కొద్ది రోజులకే.. మరోసారి ఇంటర్నెట్ ఐబొమ్మ వెబ్ సైట్ ప్రత్యక్షమైంది. బప్పమ్ పేరుతో ఉన్న లింకుపై క్లిక్ చేసిన వెంటనే నేరుగా ఐ బొమ్మ ఓపెన్ అవుతుంది. అందులో 2026 సంవత్సరానికి సంబంధించిన అన్ని కొత్త సినిమాలు కనిపించడంతో అంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు. దీంతో మరోసారి సినిమా నిర్మాతల్లో ఆందోళన మొదలైంది. గతంలో చిన్న, పెద్ద సినిమా అనే తేడా లేకుండా రిలీజైన 24 గంటల్లోపే ఈ సైట్ లో పైరసీ, హెచ్డీ ప్రింట్ లతో సినిమాలు రావడం నిర్మాతలను కలవరపెట్టిన విషయం తెలిసిందే

# ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే

- **ఇకపై సరస్వతీ నిలయంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం విద్యాభివృద్ధిలో రాజీపడబోమన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**
- **విద్యా వారోత్సవాల్లో భాగంగా ప్రజాప్రతినిధులతో చర్చా వేదిక**






ఇబ్రహీంపట్నం వెలుతురు మే13:

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ విద్యా కాంతులు విరాజిల్లేలా ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని తీర్చి దిద్దుతామని విద్యారంగాభివృద్ధి విషయంలో వెనక్కితగ్గే ప్రసక్తేలేదని ఇబ్రహీంపట్నం శాసనసభ్యు లు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోరూ.3.35కోట్లతో నిర్మించి న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు ఈ సందర్భం గా అధ్యాపకులు విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి ధన్యవాదాలు తెలిపారు దశాబ్దకా లంగాజూనియర్ డిగ్రీ కళాశాల తరగతులు ఒకేచోట షిఫ్ట్ ల వారీగా జరుగుతుండగా అనేక అవ స్థలకు గురయ్యామని ఎమ్మెల్యే ప్రత్యేక కృషితో తమ కష్టాలు తీరిపోయాయని చెప్పారు నూతనంగా నిర్మించిన తరగతి గదులు ల్యాబ్ లు ఇతర సదుపాయాలు క్రీడాప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకలసౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు పాలకుల నిర్లక్ష్యధోరణి కారణంగా పదేళ్లుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందనటానికి ఈ డిగ్రీ కళాశాల నిర్మాణతీరే నిదర్శనంగా మల్ రెడ్డి అన్నారు దేశంలో ఎక్కడాలేని విధంగా విద్యారంగాభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందని ఇందులో భాగంగానే ఆరుట్లలో పబ్లిక్ స్కూల్ నియోజకవర్గానికో యంగిండియా స్కూల్ యంగ్ ఇండియాస్పోర్ట్స్ యూనివర్సిటీ స్కిల్ యూనివర్సిటీలాంటి వాటి ఏర్పాటుతో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు భవిష్యత్తు తెలంగాణ నేటి విద్యార్థుల చేతుల్లోనే ఉందనిఆదిశగానేఆధునికమార్పులకనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తెచ్చికార్పొరేట్ ను తలదన్నేలా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు ఈ అవ కాశాన్ని ఉపయోగించుకుని రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు కార్య క్రమం అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా హాల్ టికెట్లు అందజేశారు

(గురుకుల విద్యాపీఠ్ లో ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు)

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యావారోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠ్ లో ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సుకుఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు నియోజకవర్గంలోని గ్రామాల సర్పంచులు మున్సిపల్ కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతిని ధులు ఈసదస్సులో పాల్గొనగా విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రజాప్రతినిధుల పాత్ర తల్లిదండ్రులకు కల్పించాల్సిన అవగాహన గురించి ఎమ్మెల్యే వారికి వివరించారు బాలకార్మిక వ్యవస్థ పూర్తిగా నిర్మూలన ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యమౌలిక సదుపాయాలు ఉత్త మ ఫలితాలుఆధునిక ప్రపంచంలో వస్తున్న మార్పులకనుగుణంగా ఉపాధ్యాయులు భోదనతీరు అప్డేట్ కావ టంలాంటి అంశాలను విద్యానిపుణులు ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో చర్చిం చా రు ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులుమాజీ ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **సిపిఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్.**



కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మే 13:

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ (NEET) పరీక్షలో వరుసగా జరుగుతున్న అవకతవకలు విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మేడ్చల్మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ తీవ్రంగా ఖండించారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు అపారమైన శ్రమ, ఖర్చుతో ఈ పరీక్షకు సిద్ధమవుతుంటే, ప్రశ్నాపత్రాల లీకేజీలు, మాస్ కాపీయింగ్, మార్కుల మానిప్యులేషన్ వంటి ఘటనలు విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని ఆయన అన్నారు.బీజేపీ మోడీ అవలంబిస్తున్న విధానాలు విద్యను కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి నెట్టివేయడం, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీనపరచడం వల్లే ఇటువంటి అవినీతి పెరుగుతోందని ఉమా మహేష్ పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభకు న్యాయం జరగాలంటే పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత ఉండాలని, కేంద్ర ప్రభుత్వం మరియు National Testing Agency (NTA) వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన అక్రమాలకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, అక్రమాలకు బీజేపీ పూర్తిగా సహకరిస్తున్నట్లు కనిపిస్తుందని,మేము నిజాయితీ పరులం అని అబద్దాలు చెప్పుకోవడం బీజేపీ కె చెల్లిందని,నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను సహించబోమని, అవసరమైతే విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేపడతామని ఉమా మహేష్ హెచ్చరించారు.

## సామాజిక సమరసత ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక వివాహాలు శంకర్‌పల్లి ఖండంలో తొమ్మిది జంటలకు వైభవంగా పెళ్లిళ్లు





- **సమాజ ఐక్యతకు ఇలాంటి కార్యక్రమాలు ఆదర్శం**

శంకర్‌పల్లి, వెలుతురు మే 13 :

సామాజిక సమరసత శంకర్‌పల్లి ఖండ ఆధ్వర్యంలో బద్దం జ్యోతి రెడ్డి గార్డెన్‌లో తొమ్మిది జంటలకు సామూహిక వివాహాలు ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు పెద్ద సంఖ్యలో హిందూ బంధువులు, కార్యకర్తలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొరివింద రాంచంద్రయ్య, వనవాసి కళ్యాణ ఆశ్రమం ప్రతినిధి, ప్రధాన వక్తగా మాట్లాడుతూ సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడంలో ఇలాంటి సామూహిక వివాహాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. హిందూ సమాజం ఐక్యంగా నిలిచి దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సామాజిక సమరసత ప్రాంత మహిళా కన్వీనర్ రుక్మిణి మాట్లాడుతూ సమాజంలో ఉన్న అంతరాలను తగ్గించడంలో సామాజిక సమరసత కీలక బాధ్యత నిర్వహిస్తోందన్నారు. కుటుంబ వ్యవస్థ పరిరక్షణలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత గొప్పదని ఆమె వివరించారు. కార్యక్రమంలో అజయ్ శర్మ (ప్రాంత ధర్మాచార్య సహ ప్రముఖ్), పాపిరెడ్డి దామోదర్ రెడ్డి (సామాజిక సమరసత పాలమూరు జిల్లా ఉపాధ్యక్షులు), శంకర్‌పల్లి కార్యవర్గ సభ్యులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోరింకల నందకుమార్ ముదిరాజ్ వివాహ వేడుకల్లో పాల్గొన్న వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్



మంచాల వెలుతురు మే13:

మంచాల మండలం కేంద్రంలోని దండేటికార్ శర్పంచి ఫంక్షన్ హాలో జరిగిన ఇబ్రహీంపట్నం మండ లం వైయస్సార్ యువసేన నాయకుడు గోరింకల నందకుమార్ ముదిరాజ్ వివాహవేడుకల్లో పా ల్గొని నూతన దంపతులు అఖిల నంద కుమార్ ముదిరాజ్ ను ఆశీర్వదించిన వైయస్సార్ మాధగో ని జంగయ్యగౌడ్ వైయస్సార్ అభిమానులు పోకల్ కార్ హరినారాయణజి నేనావత్ శ్రీనివాస్ నా యక్ ఈకార్యక్రమంలో మంచాల మండలం వైయస్సార్ యువసేన నాయకుడు లొంగరీ యాదగిరి ముకునూర్ గ్రామ వైయస్సార్ అభిమానులు పుట్ట రాజ్ కుమార్ ముదిరాజ్ అభవతి యాదగిరి అచ్చన శ్రీ శైలం అభవతి కిరణ్ కుమార్ పుట్టసాయి కిరణ్ ముదిరాజ్ పుట్ట శ్రీధర్ ముదిరాజ్ కొలుకులపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ఫతేపూర్ 8వ వార్డులో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుక





- **ప్రజల కలల సాకారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నేతల హామీ**

శంకర్ పల్లి, వెలుతురు మే 13 :

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫతేపూర్ 8వ వార్డులో ఈరోజు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. లబ్ధిదారులు షాబాద్ మానెమ్మ మరియు టంగుటూరి తులసి నూతన గృహాల్లో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ యోగేష్ హాజరై గృహాలను సందర్శించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగా రెడ్డి గారు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. 8వ వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. 8వ వార్డు కౌన్సిలర్ పీచరి అఖిల యాదవ్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాలు సొంతింటి కల నెరవేర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేడిపల్లి యాదయ్యగౌడ్, సుక్కా రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, ఎస్. రాజశేఖర్ రెడ్డి, జి. మహిపాల్ రెడ్డి, ఎస్. సంజీవ్, రాజేష్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు సూత్రాలేమో తెలంగాణకు.. నిధులేమో ఏపీకి

హైదరాబాద్, మే 13 (వెలుతురు):

ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణకు పొదుపు సూత్రాలు చెబుతూ ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నిధులు ఇస్తున్నారని తెరాస అధినేత్రి కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదాపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు.

పోలవరం ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని ఒత్తిడి చేస్తుంటే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పట్టించుకోవడం లేదన్నారు. ప్రధానికి లేఖ రాసి జాతీయ హోదా కోసం పోరాడాలని సూచించారు. ప్రధాని తెలంగాణకు వచ్చినప్పుడు బీఆర్ఎస్ కూడా ఒక్క ప్రశ్న అడగలేదని వ్యాఖ్యానించారు.

తెలంగాణ నీళ్ల కోసం ఏర్పడిన రాష్ట్రం అయినప్పటికీ గోదావరిలో పావు శాతం, కృష్ణాలో 50 శాతం నీళ్లను కూడా పూర్తిగా వినియోగించుకోలేకపోయామని అన్నారు. అధికారంలోకి వస్తే నీటి నిర్వహణపై ప్రత్యేక వాటర్ కమిషన్ ఏర్పాటు చేసి సాగుయోగ్యమైన ప్రతి గుంటకు నీళ్లు అందిస్తామని తెలిపారు. ప్రతి మూడు వేల ఎకరాలకు ఒక లష్కర్ నియమిస్తామని, చిన్న నదులపై పటిష్టమైన చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తామని చెప్పారు.

బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని, అతను దేశం విడిచి వెళ్లకుండా లుక్‌అవుట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాంటి ఆరోపణలు ఉన్న సమయంలో ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న వేదికను బండి సంజయ్ పంచుకోవడం శోచనీయమన్నారు. పెద్దల పిల్లలపై వచ్చిన ఆరోపణలను చూసీ చూడనట్లు వదిలేస్తారనే భావన ప్రజల్లోకి వెళ్తోందన్నారు.

మైనర్ బాలికకు సంబంధించిన అంశంలో చాలా సంయమనంతో వ్యవహరించాలని కవిత అన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహంతో బాధితురాలి ఫోటోలు బయటకు రావడం బాధాకరమన్నారు. ఆ ఫోటోలు పోస్ట్ చేసిన ఖాతాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తాము ఎప్పుడూ ఆడపిల్లల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు.

మహిళా బిల్లులో ఓబీసీ సబ్ కోటా ఉండాలని, జనగణనలో కులం, ఉపకులం, సామాజిక స్థితిగతులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపారు. బీసీలకు రాజకీయాలు, విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు దేశవ్యాప్తంగా పోరాటం చేస్తామని చెప్పారు.

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై సీఎం స్పందించాలని అన్నారు. కృష్ణా నది 300 కిలోమీటర్లు పారుతున్నా మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిపోయిందన్నారు. అప్పర్ భద్రకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్రం పాలమూరును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.

ఆంధ్రప్రదేశ్ నీటి వినియోగంలో ముందంజలో ఉందని, పోలవరం, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్, సుంకేశుల వంటి ప్రాజెక్టులతో నీటిని పూర్తిగా వినియోగించుకుంటోందన్నారు. తెలంగాణ మాత్రం భారీగా ఖర్చు చేసినా అందుబాటులో ఉన్న నీటిని పూర్తిగా వాడుకోలేకపోయిందని చెప్పారు. కృష్ణా నదిలో ఆంధ్రా 771 టీఎంసీలు వినియోగించుకుందని, తెలంగాణ కూడా తన పూర్తి వాటాను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులపై ఇప్పటికే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసామని, దానిని రిట్ పిటిషన్‌గా మార్చి న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి తెలంగాణ ప్రాజెక్టుల కోసం మాట్లాడతామని చెప్పారు.

నీట్ పేపర్ లీక్ ఘటనపై స్పందిస్తూ, "పది రూపాయల డైపర్ కూడా లీక్ కావడం లేదు.. కానీ నీట్ పేపర్ లీక్ అవుతోంది" అంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం ఆటలాడుతోందని, టెక్నాలజీ ఉన్నా పరీక్షా పత్రాలు లీక్ అవడం దురదృష్టకరమన్నారు.

తెలంగాణలో రాజకీయ శూన్యతను ప్రశ్నించేందుకే తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 20 వరకు జెండా పండుగ నిర్వహిస్తామని, తాను కూడా పలు కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. జెండా పండుగ ద్వారానే పార్టీ నిర్మాణం, పదవుల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు.

# లిక్కర్ షాపుల్లో అక్రమాలు ??



- గౌడ్ లకు కేటాయించిన రిజర్వేషన్ షాపుల్లో బినామీలు ??ఐటి మరియు ఎక్సైజ్ శాఖ దృష్టి సారించాలి
- బీసీ జేఏసి రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్

హైదరాబాద్ వెలుతురు మే 13:

రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్తులకు లిక్కర్ షాపుల్లో 15 శాతం రిజర్వేషన్లు కల్పించిందని కానీ ప్రస్తుతం గౌడ కులస్తులకు రిజర్వ్ అయిన లిక్కర్ షాపులన్నీ బినామీ పేర్లతో నడుస్తున్నాయని వీటిపై ఐటి శాఖ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి పెట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ పేరుకు మాత్రమే గౌడ్ వ్యక్తి ఓనర్ ఉంటాడని మిగతా కార్యకలాపాలని బినామీ మరియు సిండికేట్ వ్యక్తులే చూస్తున్నారని అన్నారు. ఇంటి అద్దె కూడా కట్టలేని వారు ఈ యొక్క కోట్ల రూపాయల విలువైన లిక్కర్ షాపులు ఎలా నడుపుతున్నారని విస్మయం వ్యక్తం చేశారు.గౌడులకు కేటాయించిన వైన్ షాప్ లలో బయట వ్యక్తుల ప్రమేయం ఉండడం ఏమిటని అన్నారు. అసలు బినామీలను నకిలీలను గుర్తించాలని ఈ విషయంపై త్వరలో ఎక్సైజ్ శాఖ మంత్రిని కలవనున్నట్లు ఆయన విలేకరులకు తెలిపారు.ఆయన వెంట బీసీ సంఘాల నాయకులు బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య పూరి బండి శ్రీనివాస్ యాదవ్ కుమ్మరి కుంట్ల సుధాకర్ దోనేటి శేఖర్ బంటు సైదులు ఉన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- సర్పంచ్ గర్దాస్ విక్రమ్

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 13:



ఇంద్రపాలనగరం లో జరిగిన బోదాస్ ఐలయ్య కూతురు నిశ్చితార్థం లో పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వధించి శుభాకాంక్షలు తెలియచేసిన నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి,వార్డ్ సభ్యులు వరికుప్పల స్వామి, కుంచం రమేష్, ఈర్లపల్లి మల్లయ్య, కుంచం శ్రీను, బోదాస్ నరేష్, పల్లపు లింగం, కుంచం మురళి, వరికుప్పల నర్సింహా, బోదాస్ నరేష్, బోదాస్ రాజు, వరికుప్పల రవి, భోదాస్ రవిందర్, వరికుప్పల వెంకటేష్, వరికుప్పల పాండు, వరికుప్పల శ్రీకాంత్, వరికుప్పల రమేష్, గర్ధాస్ కరుణాకర్ మాజీ ఏఎంసి డైరెక్టర్, గర్దాస్ శ్రీకాంత్, గడ్డం సాయి, గర్ధాస్ సాయి,తదితరులు పాల్గొన్నారు.


# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


రామన్నపేట వెలుతురు న్యూస్ మే 13:



మండల కేంద్రంలో లక్ష్మాపురం గ్రామానికి చెందిన బత్తుల యాదయ్య కుమార్తె వివాహము పట్టణ కేంద్రంలోని లక్ష్మి గార్డెన్లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం సర్పంచులు పులిపలుపుల సునీత, వీరస్వామి, గర్దాస్ విక్రమ్. మాజీ సర్పంచ్ బత్తుల శంకరయ్య మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం,ఎండి ఆమీర్. మాజీ యూత్ మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న ఉప సర్పంచులు నీల నరసింహ, చొప్పరి నరసింహ, మాజీ ఉపసర్పంచులు బత్తిని మహేష్, గండికోట ఆంజనేయులు. నాయకులు బొలుగుల కృష్ణ, బొడ్డుపల్లి రాజు, అనంత చారి, జోగుల సత్యనారాయణ స్వామి, సైదులు, వెంకట్ రెడ్డి, అశోక్, మల్లేశం, శ్రీను తదితరులు పాల్గొనడం జరిగింది.

# రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో క్రీడా పోటీల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు సన్మానం





- రాష్ట్రస్థాయిలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన ఉపాధ్యాయ బృందానికి సన్మానం

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 13:

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మూడవ రోజు విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈరోజు జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో క్రీడా సాంస్కృతిక పోటీలతో పాటు ఎన్ఎస్ఎస్, ఎన్సిసి వంటి కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మరియు రాష్ట్రస్థాయి జిల్లాస్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను పొందిన అధ్యాపకులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ పి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అనేక బహుమతుల్ని పొంది కళాశాలకు గుర్తింపును తీసుకొచ్చిన విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిని అందిస్తున్నారని, చదువుతోపాటు ఆయా రంగాల్లో తమ ప్రతిభను విద్యార్థులు ప్రదర్శించినప్పుడే కళాశాలకు మరింత గుర్తింపు రావడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమ ఇన్చార్జి డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య సభ్యులు డాక్టర్ చెనగోని వెంకట్ గౌడ్, అద్దంకి ఆంజనేయులు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చిన్న బాబు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి నీలిమతో పాటు అధ్యాపకులు డాక్టర్ జి. సునీత, డాక్టర్ డి. కిషన్, డాక్టర్ పి.బ్రహ్మం, డాక్టర్ ఎం. రవీందర్ రావు, టి. శ్రీనివాస్, రవితో పాటు కార్యాలయ సిబ్బంది ఫయాజ్, షరీఫ్, శ్రీదేవి, బసవయ్య, రాంబాబు, కిరణ్, నవీన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే సూచనలు

హైదరాబాద్ వెలుతురు మే 13:

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

రానున్న ఆరు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్ర వడగాలులు, 44 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి బుధవారం ఆదేశించారు.

ఒకవైపు భగ్గుమంటున్న ఎండలు, మరోవైపు ఈదురు గాలులు, ఉరుములుమెరుపులతో కూడిన అకాల వర్షాలు సంభవించే పరిస్థితులు ఉన్నందున ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు.

ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, తదుపరి రోజుల్లో జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా ఎండల తీవ్రత పెరిగే అవకాశముందని తెలిపారు.

ఈ పరిస్థితుల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని, ఎండలో పనిచేసే వారు తలకు రక్షణ కల్పించే వస్త్రాలు ధరించాలని సూచించారు.

వడదెబ్బలు, ఎండ తీవ్రత కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వడదెబ్బ నివారణ చర్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.

రైతులు, కూలీలు, నిర్మాణ కార్మికులు, రహదారులపై పనిచేసే కార్మికులు ఎండ తీవ్రత సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మంత్రి సూచించారు. ఈదురు గాలులు, ఉరుములుమెరుపులు సంభవించే ప్రాంతాల్లో ప్రజలు చెట్ల కింద నిలబడకుండా, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

హైదరాబాద్ వెలుతురు మే 13:

తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ మేరకు బుధవారం డీజీపీ సీవీ ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కే. ఇలంబర్తితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షల నిర్ణయాల మేరకు బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

గతంలో వెలుగుచూసిన పశువుల అక్రమ రవాణా ఘటనల నేపథ్యంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (SOP) అమలు చేయడానికే ఈ సమీక్ష నిర్వహించినట్లు ఆయన వివరించారు. కౌ స్లాటర్ యాక్ట్ 1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్ 1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ యాక్ట్ 1960లను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

పశువుల రవాణా నియంత్రణ కోసం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత నిఘా ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 203 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

రానున్న 15 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని డీజీపీ హెచ్చరించారు. అనుమానాలుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలే తప్ప రహదారులపై ఘర్షణలకు దిగకూడదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గోరక్షక బృందాలు, ఇతర వర్గాలు చట్టాన్ని పాటిస్తూ వ్యవహరించాలని ఆయన కోరారు. అవసరమైతే సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు రెండు వర్గాలతో విడివిడిగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రత్యేక వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువుల సంరక్షణ కోసం క్యాటిల్ పౌండ్లు ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, గందరగోళం సృష్టించే పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీజీపీ తెలిపారు. అవసరమైతే అలాంటి వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

ఇక సమావేశంలో అధికారులు తమతమ శాఖల చర్యలను వివరించారు. మున్సిపల్ శాఖ ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్ మాట్లాడుతూ, అన్ని నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. పశుసంవర్ధక శాఖ కార్యదర్శి కే. ఇలంబర్తి మాట్లాడుతూ వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

పోలీసు ఉన్నతాధికారులు, ఐజీపీలు, ఇంటెలిజెన్స్ అధికారులు సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని తమ ప్రాంతాల్లో అమలు చేయనున్న చర్యలపై నివేదికలు ఇచ్చారు.

# కమ్యూనిస్టులను ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దు

- దేశంలో కమ్యూనిస్టుల ప్రాభవం తగ్గిందనడం పొరపాటు
- వారు ఇప్పటికీ సజీవంగానే ఉన్నారు.: పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, మే 13(వెలుతురు):

కమ్యూనిస్టులపై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టుల ప్రాభవం తగ్గిందని భావించడం పొరపాటని, వారు ఇప్పటికీ సజీవంగానే ఉన్నారని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. మారుతున్న రాజకీయ సమీకరణాల్లో కమ్యూనిస్ట్ భావజాలం ప్రాముఖ్యతను ఆయన గుర్తు చేస్తూ, వారి ఉనికిని తక్కువ అంచనా వేయవద్దని పేర్కొన్నారు. దేశంలో కమ్యూనిజం కనుమరుగైందని అనుకోవడం ఒక అపోహ మాత్రమేనని, క్షేత్రస్థాయిలో వారు ఇప్పటికీ బలంగానే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు 'ప్రజలు ప్రతిపక్ష పాత్ర కేసీఆర్‌కు ఇచ్చారు.. కానీ ఆయన ఫామ్ హౌజ్‌కు పరిమితం అయ్యారు. అయినా మేము ప్రతిపక్ష నేతను గౌరవిస్తున్నాము. కేసీఆర్ లాగా బిహేవ్ చేయము. ఆనాడు దళితుడు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉంటే కేసీఆర్ ఓర్చుకోలేక పోయారు. మా ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ వీక్‌గా ఉందన్న విషయం మోడీకి అర్థం అయ్యింది. అందుకే తెలంగాణకు వచ్చినట్టు మాకు అర్థం అవుతుంది' అని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు.

# గచ్చిబౌలిలో విషాదం.. లిఫ్ట్‌లో చిక్కుకుని చిన్నారి మృతి

నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధి గౌలిదొడ్డిలో విషాదం చోటుచేసుకుంది. లిఫ్ట్‌లో చిక్కుకుని ఐదేళ్ల చిన్నారి మృతిచెందింది. ఓ మహిళా హాస్టల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతిచెందిన చిన్నారిని పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిస్తు ఘోష్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దంపతులు మహిళా హాస్టల్‌లో వంట పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వారికి ఐదేళ్ల చిన్నారి బిస్తు ఘోష్ ఉంది. బుధవారం మధ్యాహ్నం గ్రిల్ లిఫ్ట్‌లో అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ నుంచి 5వ ఫ్లోర్‌కు బాలిక వెళ్లింది. ఈ క్రమంలో 3వ ఫ్లోర్‌లో చిన్నారి జుట్టు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయింది. దీంతో తల మొత్తం నుజ్జునుజ్జయి బిస్తు ఘోష్ మృతిచెందింది. గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. హైడ్రా, ఫైర్ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బ్రీత్ మౌంటెన్ రీ ట్రీట్ సెంటర్ లో చిన్నారులకు వేసవి శిబిరం

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు మే 13:**

వేరాచకొండ గుట్టల మధ్యనున్న బ్రీత్ మౌంటెన్ రీ ట్రీట్ సెంటర్ అరబిందో ఆశ్రమంలో చిన్నారులకు వేసవి శిబిరం బుధవారం ప్రారంభించారు. సిద్ధ సమాధి యోగ ఆచార్యులు రవీందర్ బాపూజీ ఆధ్వర్యంలో కిషోరా సిద్ధ సమాధి యోగ శిక్షణ నిచ్చేందుకు అర్ధమండలం 21 రోజుల శిక్షణా శిబిరాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. 10 నుంచి 16 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు ఈ శిబిరంలో ఆచార్య సౌజన్య లక్ష్మీ మాతాజీ ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రశాంతమైన ప్రకృతి మధ్యన శిబిరంలో పాల్గొన్న చిన్నారులను తెల్లవారుజామున 4:30కే నిద్రలేపి సూక్ష్మ వ్యాయామాలు ధ్యానం యోగ సాధనలో శిక్షణ ఇస్తున్నారు. సేంద్రీయ పద్ధతిలో పండించిన పదార్థాలతో అల్పాహారం భోజనం అందిస్తున్నారు. తాము తిన్న పల్లెలను తామే శుభ్రం చేసేలా అందరితో నేలపై సహపంక్తి భోజనం చేసేలా శిక్షణ ఇస్తున్నారు. చుట్టూ ఉన్న గుట్టలపై ట్రెక్కింగ్ చేయిస్తున్నారు. స్వచ్ఛమైన ప్రాణవాయువును పీలుస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ అడవిలో కాలిబాటన నడిపిస్తున్నారు. సెల్ ఫోను టీవీ తెరలకు అలవాటు పడకుండా కథలు చెబుతున్నారు పాటలు పాడిస్తున్నారు ఆటలు ఆడిస్తున్నారు సనాతన ధర్మం గురించి వివరిస్తున్నారు భగవద్గీత శ్లోకాలను కంఠస్థం చేయిస్తున్నారు. 21 రోజుల శిక్షణలో పిల్లలను అంతర్గతంగా శుద్ధి చేసే కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు శిబిరం నిర్వాహకుడు రవీందర్ బాపూజీ తెలిపారు. బ్రీత్ అరబిందో ఆశ్రమం వ్యవస్థాపకుడు అరవింద్ రెడ్డి, మేనేజర్ సలాం ఆజాదులు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.






# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులు వెంటనే పరిష్కరించాలి




- **మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

నార్కట్ పల్లి వెలుతురు మే 13

నార్కట్ పల్లి మండలంలోని షాపల్లి, నెమ్మాని గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అమ్మిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, సకాలంలో కాంటాలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు రోజులు తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్న పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి కొనుగోళ్లలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# అరుణ – సాయి ఎంగేజ్మెంట్ వేడుకలో పాల్గొన్న ... నేతగాని కృష్ణయ్య

నార్కట్ పల్లి వెలుతురు మే 13




నార్కట్ పల్లి మండల కేంద్రంలోని శబరి గార్డెన్లో చెరువుగట్టు గ్రామానికి చెందిన గదారి దశరథ - ధనమ్మ దంపతుల చిన్న కుమార్తె అరుణ - సాయి ఎంగేజ్మెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చెరువుగట్టు సర్పంచ్ నేతకాని కృష్ణయ్య కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పిఎసిఎస్ డైరెక్టర్ గడుసు శశిధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్ల శంకర్, చీర లింగయ్య, గౌరీదేవి శంకర్, నేతకాని శ్రీనివాస్, గదారి శంకర్, వార్డు మెంబర్ కూకుట్ల శ్రీకాంత్, కూకుట్ల శివ, దొడ్డి రాజు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# మానవత్వంతో ముందుకు రావాలి ప్రాణాలను కాపాడాలి

నార్కట్ పల్లి వెలుతురు మే 13:

నార్కట్ పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన RMP డాక్టర్ కార్తీక్ గత సంవత్సరం పాము కాటుకు గురై తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. ఆ తర్వాత ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు విషమిస్తూ ప్రస్తుతం లివర్ పూర్తిగా దెబ్బతిన్న స్థితికి చేరుకుంది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం కనీసం 50 లక్షలు ఖర్చు అవుతాయని హాస్పటల్లోని వైద్యులు చెప్తున్నారు. ప్రతిరోజూ శరీరం నుంచి సుమారు 5 లీటర్ల వరకు నీటిని తొలగించే పరిస్థితి ఏర్పడింది. కుటుంబ పరిస్థితి దయనీయంగా మారి వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో గ్రామ ప్రజలు, దాతలు, మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయం అందించి ఒక యువకుడి ప్రాణాలను కాపాడాలని మన స్ఫూర్తిగా వేడుకుంటున్నాం.. చిన్న సహాయం కూడా ఒక కుటుంబానికి పెద్ద ఆశగా మారుతుంది. మన సహాయం ఒక ప్రాణాన్ని నిలబెట్టగలదు.


IMPRESSION:
- Liver parenchymal changes ? Cirrhosis
- Moderate ascites 1000cc
- Bilateral thin streak of pleural effusion



**PhonePe / GPay 9640114656**
**పేరు: కార్తీక్ ఆగవరపు**
**Bank account IDBI Bank**
**Number:163910400001885**
**Contact: 9640114656**

# హాలియాలో వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం.. హాజరైన నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియా పట్టణం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నందు
హాలియా సీతారామచంద్రస్వామి సహిత స్వయంభు భక్తాంజనేయ స్వామి ఆలయ 15వ వసంతోత్సవాల సందర్భంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న నల్లగొండ జిల్లా శాసనమండలి సభ్యులు.యం.సి కోటిరెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముఖ్య సలహాదారుడు పురుషోత్తం, వజతేజ రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్. చిట్టిపోలు యాదగిరి, దేవస్థాన కమిటీ సభ్యులు మోహన్ రావు, బాలకృష్ణ,కాకునూరి నారాయణ గౌడ్, వర్కాల సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి,చీదల లింగయ్య, ఎల్ఐసి శ్రీనివాస్,నిమ్మల లక్ష్మారెడ్డి, మీసాల ఆంజనేయులు, చిన్న నారాయణ గౌడ్, కోమ్మనబోయిన శేఖర్ గౌడ్, మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# బొడ్రాయి ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి



మోత్కూర్ బీబీనగర్, మే 13 (వెలుతురు న్యూస్)

బీబీనగర్ మండల పరిధిలోని రవిపహడ్ తండా గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ దేవత అయిన బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు బొక్క జైపాల్ రెడ్డి .BRS రాచమల్ల శ్రీనివాసులు ఆర్య వైశ్యం జిల్లా అధ్యక్షులు మల్లగారి శ్రీనివాస్. తూర్పునూరి శేఖర్ గౌడ్. కొంతం లింగయ్య గౌడ్. గ్రామ సర్పంచ్ బానోత్ శంకర్ నాయక్. మాజీ సర్పంచ్ మహేష్ బాబు. సంకురి నాగరాజ్. జక్కినగేష్. దొంతి రెడ్డి. శ్రీనివాస్ రెడ్డి. కొంతం భాస్కర్ గౌడ్. వెంకటేష్ గౌడ్. దేవరకొండ శ్రీనివాస్. గ్రామ ప్రజలు పాల్గొన్నారు



# పాడి రైతుల పక్షపాతి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఘన సత్కారం



- **ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గుండాల గ్రామ పాడి రైతులు)**

గుండాల, మే 13 (వెలుతురు)

పాడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సేవలను కొనియాడుతూ గుండాల గ్రామ పాడి రైతులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి, పాల రైతుల సంక్షేమానికి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. రైతుల పక్షాన నిలిచి ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పొడిశెట్టి వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు అన్నెపర్తి యాదగిరి, స్థానిక సర్పంచ్ ఐలయ్య, ఉపసర్పంచ్ సాయి ప్రసాద్, వార్డు సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన.. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు

- **మార్కెట్ కమిటీ చైర్పర్సన్ కనకుంట్ల శ్రీ రేఖ బాబు రావ్**

భువనగిరి మే, 13 (వెలుతురు న్యూస్)



యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం ముతిరెడ్డి గూడెం గ్రామంలో ₹26 కోట్ల వ్యయంతో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు. మన ప్రాంత ఆడబిడ్డలకు స్థానికంగా నర్సింగ్ విద్యను అందుబాటులోకి తెచ్చిన ఘనత మన MLA కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారిది. ఈ కళాశాల ద్వారా భవిష్యత్తులో జిల్లాకు నైపుణ్యం కలిగిన నర్సులు అందుతారు. భువనగిరి నియోజకవర్గాన్ని విద్యా, వైద్య రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందుకు. మీ చొరవతో మంజూరైన ఈ నర్సింగ్ కళాశాల భువనగిరి ప్రాంత చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసి, విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుకుంటున్నాం. మీ సేవలు ఇలాగే కొనసాగాలని బోనగిరి నియోజకవర్గ ప్రజల తరుపున కోరుకుంటున్నాం..

## ముంపు ఏరియా లో పండిన వరిపంటను కొనుగోలు చేయండి



- **తహసీల్దార్ ను కలిసిన భాధిత రైతులు.**

కరీంనగర్ వెలుతురు మే 13

ముంపు కు గురై ఎఫ్ టి ఎల్ కు దూరంగా ఖాళీగా ఉన్నటువంటి భూములలో ఒక సీజన్ వ్యవసాయం చేసుకుంటూ పండించిన వరి పంటను అధికారులు కొనుగోలు చేసేలా సహకరించాలని రామక్రిష్ణకాలనీ గ్రామ భాధిత రైతులు బుధవారం మండల తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి ని కలిసి వినతిపత్రం ఇచ్చారు.ఎల్ఎండి రిజర్వాయర్ పరిధిలో ముంపుకు గురైన వారి స్వంత భూములలో సుమారు 70 మందికి పైగా గత 25 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ తద్వారా వచ్చిన పంటలను అమ్ముకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని,ఇలా పండించిన వరి ధాన్యాన్ని స్థానిక కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయడం లేదని వారి వెంట వచ్చిన బీజేపీ నాయకులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి తహసీల్దార్ కు వివరించారు. వ్యవసాయం తప్ప వేరే పనులు అలవాటు లేని సదరు రైతులు ఇలాంటి భూములలో పండిస్తున్న పంటలను మానవతా దృక్పధం తో ఆలోచించి కొనుగోలు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఇటువంటి సమస్యలు ఎదురైనప్పుడు రైతు ద్వారా ధ్రువీకరించిన పత్రంనకు వ్యవసాయ అధికారి ద్వారా అనుమతి తీసుకొన్న తర్వాత కొనుగోలు చేశారని అదే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి కొనుగోలు చేసేలా సహకరించాలని రైతులు గోనెల భూమయ్య,గంగు రాజమల్లు,కోతి మల్లేశం, ఆవుల లచ్చయ్య,గంగు తిరుపతి,అట్ల అంజయ్య తదితరులు తహసీల్దార్ ను కోరారు. వారి వెంట బీజేపీ నాయకులు గడ్డం అరుణ్, కోతి రాజు ఉన్నారు.ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారం చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

## సంస్మరణ సభలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా. సిద్ధం ఉజ్వల్..!



- **కార్యక్రమంలో పాల్గొన్న మాజీ టీజీఐడీసీ చైర్మన్ తన్వీర్...**

జహీరాబాద్ వెలుతురు మే 13

సంగారెడ్డి జిల్లా ఝరసంఘం మండలం బర్దిపూర్ గ్రామంలో నిర్వహించిన మాతృ శ్రీ అనసూయ మాత దివ్య సంస్మరణ సభలో పాల్గొన్నారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి, మాజీ టీజీఐడీసీ చైర్మన్ తన్వీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి బీజీ సందీప్ బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భీమా క్లయిమ్ అందించిన బీఓబీ బ్యాంకు



తిమ్మాపూర్ వెలుతురు మే 13:

తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణకాలనీ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ సిబ్బంది ఐన దుర్సెట్టి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యం తో మృతి చెందారు. కాగా నుస్తులాపూర్ లోని బ్యాంక్ ఆఫ్ బరోడా లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా పథకం (పిఎంజేజేవై) క్రింద భీమా చేయించుకున్నందున అతని కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల నిధిని ఎల్లయ్య భార్య కనకవ్వ కు బ్యాంక్ మేనేజర్ ఎ. బాలరాజు అందించారు. 18 నుండి 50 ఏళ్ల వయస్సున్న వారెవరైనా వారి బ్యాంకు ఖాతా ఉన్న చోట ఇష్టపూర్వకంగా భీమా చేయించుకోవాలని, ఇందుకు ప్రతీ ఏడాది కొంత డబ్బు మే నెలలో ఆటోమాటిక్ డెబిట్ రూపంలో కట్ అయి భీమా వర్తిస్తుందని కావున ప్రతీ ఖాతాదారులు భీమా చేయించుకోవాలని సూచించారు. బ్యాంకు సిబ్బంది సాయిరాం, కుమారస్వామి, వసుందర, ఇందుజ,అనూష తదితరులు కార్యక్రమంలో ఉన్నారు.

## ఆరోగ్య సేవల్లో కొత్త అధ్యాయం... జహీరాబాద్‌లో విజయ కేర్ ఆసుపత్రి ప్రారంభం

- **ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి...**

జహీరాబాద్ వెలుతురు, మే 13



జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేట్ డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "శ్రీ విజయ కేర్" ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు హుగ్గెల్లి రాములు సోదరుడు అంజన్న కుమార్తె ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి ఆసుపత్రులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంత ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం అవసరమని తెలిపారు. సేవాభావంతో ఆసుపత్రిని ప్రారంభించిన యాజమాన్యాన్ని అభినందిస్తూ వైద్యులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. జహీరాబాద్ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో విజయ కేర్ ఆసుపత్రి ప్రారంభమవడం ఆనందదాయకమని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ మొబిన్, మున్సిపల్ చైర్మన్ యూనస్, కౌన్సిలర్లు జంగీర్, జాఫర్, జమీల్, అతిక్, అరుణ్, అక్రమ్, నిజాం, శ్రీధర్ రెడ్డి, సీడీసీ డైరెక్టర్ మల్లా రెడ్డి, మాజీ ఎంపీపీ గుండు రెడ్డి, ధనసిరి మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, భీమయ్య, మోతీరం, భర్కత్, ముస్తఫా, నరసింహ, నథానియాల్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మాణిక్ రావు

- **గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రజల ప్రశంసలు....**

జహీరాబాద్ వెలుతురు మే 13



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి గ్రామ ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసలు అందుకుంటున్నాయి. ముఖ్యంగా ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక చేయూత అందిస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలన్న లక్ష్యంతో సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన బొడ్డు వితమ్మబాలరాజు దంపతుల కుమార్తె క్రిష్ణవేణి వివాహ ప్రధాన కార్యక్రమానికి సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం వధువు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఆడబిడ్డల వివాహాలకు తమ వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. పేద కుటుంబాలపై పెళ్లిళ్ల సమయంలో ఆర్థిక భారం ఎక్కువగా ఉంటుందని, అలాంటి సమయంలో సహాయం చేయడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సర్పంచ్ సేవలను పలువురు గ్రామస్థులు అభినందించారు. ముఖ్యంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి సహాయం చేయడం ద్వారా యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. వధువు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల పట్ల ఆయన చూపుతున్న సేవాభావం ఎప్పటికీ మరవలేమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, వార్డు సభ్యులు బాల్ రాజు, నరేష్, సీనియర్ నాయకులు మునిందర్ రెడ్డి, నర్సింహులు, సంజీవ్, మశ్చందర్, సిద్ధా రెడ్డి, పాండురంగా రెడ్డి, శ్రీనివాస్, అక్బర్, రాములు, బాబు, దావిడ్ తదితరులు, గ్రామస్థులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దైవ స్వరూపిణి అనసూయ మాతకు ఘన నివాళి





- **బర్దిపూర్‌లో వైభవంగా దివ్య సంస్మరణ సభ ఆలయ నమూనా ఆవిష్కరణ...**
- **భక్తులతో కిటకిటలాడిన ఆశ్రమం...**

జహీరాబాద్ వెలుతురు మే 13

"మానవ సేవే మాధవ సేవ" అనే మహోన్నత ఆశయంతో జీవితాన్ని అంకితం చేసి ఆరు దశాబ్దాలుగా భక్తులకు సేవలందించిన బర్దిపూర్ మాతృమూర్తి అనసూయ మాత నిజమైన దైవ స్వరూపిణి అని వివిధ ఆశ్రమాల మఠాధిపతులు, పీఠాధిపతులు కొనియాడారు. బుధవారం ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో అనసూయ మాత దివ్య సంస్మరణ సభను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆశ్రమం భక్తులతో కిక్కిరిసిపోయింది. అనసూయ మాత ఆనంద నిలయంలో ప్రత్యేక పూజలు, మహా రుద్రాభిషేకం, మంగళహారతులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పాదుకలను ప్రతిష్టించి మహా మంగళహారతి చేశారు. ఈ సందర్భంగా ఆలయ నమూనాను ఆవిష్కరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నిర్వహించిన ధర్మసభలో వివిధ ప్రాంతాల పీఠాధిపతులు, మఠాధిపతులు పాల్గొని అనసూయ మాత సేవలను స్మరించుకున్నారు. అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి మహారాజ్, సంగ్రామ్ మహారాజ్, వీరేశ్వర శివాచార్య తదితర ఆధ్యాత్మిక గురువులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే జహీరాబాద్ ఎమ్మెల్యే కొణింటి మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి తదితర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ఘన నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ అనసూయ మాత తన జీవితమంతా పేదలకు విద్యాదానం, వృద్ధాశ్రమ సేవలు, ఉచిత వైద్యసేవలు, ప్రభుత్వ ఆసుపత్రికి ఉచితంగా స్థలం అందించడం, నిత్య అన్నదానం, ఆధ్యాత్మిక మార్గదర్శనం వంటి సేవల ద్వారా వేలాది మంది జీవితాల్లో వెలుగునింపారని పేర్కొన్నారు. అమ్మవారు ఒక తల్లిలా అందరికీ అండగా నిలిచి భక్తులను ధర్మ మార్గంలో నడిపించారని కొనియాడారు. అమ్మవారి ఆశయాలను కొనసాగిస్తూ భక్తులకు మరింత సేవలందించేందుకు కృషి చేస్తామని ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. బర్దిపూర్ దత్తగిరి ఉత్సవ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారికి ఘన స్వాగతం పలికిన సర్పంచ్ శిగ నరేశ్ గౌడ్



**బీబీనగర్ మే,13 (వెలుతురు న్యూస్ ).**

బీబీనగర్ మండలంలో రావి పహాడ్ గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి పండుగకు వెళ్తున్న భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారిని ముగ్ధంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ శిగ నరేశ్ గౌడ్ ఘన స్వాగతం పలకడం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గ్రామ మహిళలతో మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు గురించి మరియు వడ్ల కొనుగోలు ఏ విధంగా జరుగుతున్నాయని ఆరా తీయడం జరిగింది గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కావాలనుకున్న గ్రామ సర్పంచ్ ద్వారా మా దృష్టికి తీసుకురావాలని ఉన్నారు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి మొదటి విడతలో రాని నిరుపేద ప్రజలకు ఇప్పుడు జూన్ 2వ తేదీన రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించడం జరుగుతుంది అప్పుడు గ్రామంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సిసి రోడ్లు గ్రామంలో ఎక్కడన్నా అవసరాలు ఉన్నాయంటే వెంటనే మంజూరు చేస్తామని అన్నారు ఈకార్యక్రమంలో గోలి పింగిల్ రెడ్డి పట్లోళ్ల శ్యామ్ గౌడ్ సురకంటి సత్తిరెడ్డి గడ్డం బాలకృష్ణ గౌడ్ బీబీనగర్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ గొల్లగూడెం సర్పంచ్ పర్వతి కుమార్ యాదవ్ బండారు బుచ్చి రాములు మట్టా పరమేష్ శెట్టి ఐలయ్య నరసింహ తదితరులు పాల్గొన్నారు

## 8వ వార్డులో తాగునీటి కష్టాలకు పరిష్కారం



- **బోరు పనులు ప్రారంభించిన చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**

భువనగిరి మే, 13 (వెలుతురు న్యూస్).

భువనగిరి పట్టణంలోని ఎనిమిదో 8వ వార్డులో గల జంఖానా గూడెంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ బోరు వేయించే పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, స్థానిక కౌన్సిలర్ తహేరా బబ్లు ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, "ప్రజల మౌలిక సదుపాయాల కల్పనే మా ప్రభుత్వ ధ్యేయం. ఎనిమిదో వార్డులో నీటి ఎద్దడి ఉందని మా దృష్టికి రాగానే వెంటనే స్పందించి బోరు మంజూరు చేయించాం. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే మా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీ ఈ కొండలరావు మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, స్థానిక కౌన్సిలర్ తహేరా బబ్లు, బర్రె కరుణాకర్ కాంగ్రెస్ నాయకులు కూర శివకుమార్, నీలం సత్యనారాయణ, ఎండీ షాహెద్, కిట్టు, మహిళలు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దు

- డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో కీలక పరిణామం
- నలుగురు సాక్షులను బెదిరించినట్లు ఆరోపణలు
- తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపుతానని బెదిరింపులు
- సాక్షులను ప్రలోభపెట్టినట్లు కోర్టు ముందు ఆధారాలు
- బెయిల్ షరతుల ఉల్లంఘనగా కోర్టు వ్యాఖ్య
- సుప్రీంకోర్టు బెయిల్‌ను రద్దు చేసిన ప్రత్యేక న్యాయస్థానం
- హత్య కేసు విచారణలో కీలక పరిణామం
- అనంతబాబు జ్యుడీషియల్ రిమాండ్ కొనసాగింపు
- డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో కొనసాగుతున్న విచారణ
- ఈ నెల 20 నుంచి రెగ్యులర్ ట్రయల్ ప్రారంభం
- కోర్టు తీర్పుతో కేసు మరింత వేగవంతం అయ్యే అవకాశం




రాజమహేంద్రవరం వెలుతురు మే 13

వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకుకు గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానం రద్దు చేసింది. డ్రైవర్ వీధి సుబ్రమణ్యం హత్య కేసులో సాక్షులను ప్రభావితం చేసినట్లు ఆధారాలు ఉండటంతో కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో కేసు విచారణ పూర్తయ్యే వరకు ఆయన జైలులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తాజా తీర్పుతో డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసు మరో కీలక మలుపు తిరిగింది. బెయిల్‌పై ఉన్న సమయంలో సాక్షులను ప్రభావితం చేసినట్లు వచ్చిన ఆరోపణలను కోర్టు తీవ్రంగా పరిగణించింది. విచారణలో సమర్పించిన ఆధారాలు బలంగా ఉండటంతో బెయిల్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు గతంలో ఏప్రిల్ 24న అనంతబాబును అరెస్ట్ చేశారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించి రిమాండ్ ఖైదీగా ఉంచారు. హత్య కేసులో సాక్షులను బెదిరించడం, ప్రభావితం చేయడం వంటి చర్యలను కోర్టు అత్యంత తీవ్రంగా పరిగణించింది. సాక్షుల వాంగ్మూలాలపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించినట్లు వచ్చిన ఆరోపణలు విచారణలో బలపడటంతో బెయిల్ రద్దు నిర్ణయం తీసుకుంది. పోలీసుల తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాల సుబ్బారావు కోర్టులో వాదనలు వినిపించారు. సాక్షుల భద్రతకు ముప్పు ఉందని, కేసు విచారణపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం బెయిల్‌ను రద్దు చేసింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం, డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసు విచారణ పూర్తయ్యే వరకు అనంతబాబు జైలులోనే ఉండనున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి కేసు రెగ్యులర్ విచారణ ప్రారంభించనున్నట్లు న్యాయస్థానం వెల్లడించింది. హత్య కేసు విచారణలో కీలక సాక్ష్యాలు, వాంగ్మూలాలు, ఆధారాల సమీక్ష జరగనుంది. సాక్షులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా న్యాయపరమైన ప్రక్రియ కొనసాగించాలని కోర్టు స్పష్టం చేసింది. తాజా బెయిల్ రద్దు నిర్ణయంతో కేసు మరింత వేగంగా ముందుకు సాగనుందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. సాక్షుల భద్రత, న్యాయ ప్రక్రియ పారదర్శకతపై కోర్టు ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

# 'డబుల్ ఇంజిన్' అంటే పేపర్ల లీకేజీయేనా?

- కేంద్రం అసమర్థతకు 'నీట్' కుంభకోణమే నిదర్శనం
- కూసుమంచి మండలం జీళ్లచెరువు క్లస్టర్ ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి గర్జన



కూసుమంచి వెలుతురు మే 13

కేంద్రంలోని బీజేపీ సర్కార్ తన అసమర్థతతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అభివృద్ధి చేయడం కాదు.. పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల గొంతు కోయడమేనా? అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

***కేంద్రానిది కళ్లుండి చూడలేని తనం!***

నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరీక్షకు 42 గంటల ముందే పేపర్లు బయటకు రావడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా 23 లక్షల మంది మన రాష్ట్రంలో 70 వేల మంది విద్యార్థులు ఈ కుంభకోణం వల్ల రోడ్డున పడ్డారని అవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మాత్రం ఏమీ ఎరుగనట్లు నాటకమాడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



***నాడు దొరల పాలనలోనూ...***

తెలంగాణలో గత పదేళ్ల 'దొరల పాలన'లో జరిగిన అన్యాయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రూప్1 నుంచి గ్రూప్4 వరకు అన్ని పేపర్లూ లీక్ అయ్యాయన్నారు. ఆనాటి ప్రభుత్వ మంత్రుల పీఏలే జిరాక్స్ సెంటర్లలో పేపర్లు అమ్మారని ఆరోపించారు. ఆనాడు ఇంటర్ ఫలితాల తారుమారు వల్ల 28 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే నియామక సంస్థలను ప్రక్షాళన చేసి, పారదర్శకంగా 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు.

**ప్రజా దర్బార్‌లో అర్జీల వెల్లువ**

జీళ్ళచెరువు క్లస్టర్ పరిధిలోని 13 గ్రామ పంచాయతీల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి మంత్రి పొంగులేటి జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలపై వచ్చిన వినతులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. న్యాయమైన ప్రతి సమస్యను 100 శాతం పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

# విశ్వబ్రాహ్మణులకు న్యాయం చేస్తాం

- సామాజికన్యాయ కాంగ్రెస్ పార్టీ నినాదం : పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- గాంధీ భవన్‌లో విశ్వబ్రాహ్మణ సంఘాల నేతలతో సమావేశం
- వర్గ సమస్యలు, అభివృద్ధి అంశాలపై ప్రతినిధుల వినతులు
- సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబాటు అని స్పష్టీకరణ
- వృత్తి ఆధారిత వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యత
- అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి



హైదరాబాద్ వెలుతురు మే 13

గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ విశ్వబ్రాహ్మణ సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ భేటీలో వర్గానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలను సంఘాల ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ప్రతినిధులు తమ వృత్తి ఆధారిత సమస్యలు, సామాజిక భద్రత, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై వివరంగా చర్చించారు. ప్రభుత్వం స్థాయిలో తమకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం అనేది పార్టీ మూల సిద్ధాంతమని ఆయన గుర్తుచేశారు. వృత్తి ఆధారిత వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. చిన్న వృత్తులు, సంప్రదాయ జీవనోపాధులు కొనసాగేందుకు అవసరమైన సహాయ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.
ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సమావేశంలో స్పష్టం చేశారు. మొత్తంగా గాంధీ భవన్‌లో జరిగిన ఈ సమావేశం సామాజిక వర్గాల సమస్యలు, ప్రభుత్వ స్పందనపై చర్చకు వేదికగా మారింది.

# బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే సీఎం క్యాంపు ఆఫీస్ ముట్టడిస్తాం: ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్ వెలుతురు మే 13



సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఎంపీ R. కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పలు డిమాండ్లు ప్రభుత్వానికి వినిపించారు. మెస్ చార్జీలు పెంచాలని, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. GO 7ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన కాలేజీ హాస్టళ్లలో డైట్ చార్జీలు వెంటనే చెల్లించాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్ కాలేజ్ హాస్టళ్ల నిర్మాణం పేరుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను తొలగించవద్దని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను అడ్డుకుంటామని, సీఎం క్యాంపు ఆఫీస్‌ను ముట్టడిస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు.

# మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

అమరావతి వెలుతురు మే 13




పెదపాడులో కొత్త పాఠశాల భవనం ప్రారంభం రూ.17.50 లక్షలతో ఆధునిక భవనం ఏర్పాటు గత ఏడాది ఇచ్చిన హామీ అమలు అడవితల్లి బాటలో చేసిన వాగ్దానం నెరవేర్పు డుంబ్రిగూడ మండలంలో నిర్మాణం పూర్తి గ్రామ మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి 2026 విద్యా సంవత్సరం నుంచి వినియోగం గ్రామస్థుల్లో హర్షం.. ఉపాధ్యాయుల విజ్ఞప్తికి స్పందన పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు అల్లూరి సీతారామరాజు జిల్లా పెదపాడు గ్రామంలో కొత్త పాఠశాల భవనం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రూ.17.50 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించినట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పాఠశాల అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో గ్రామంలో ఆనందం వ్యక్తమవుతోంది.
గత ఏడాది ఏప్రిల్ 7న అరకు నియోజకవర్గం పరిధిలోని డుంబ్రిగూడ మండలం పెదపాడు గ్రామంలో నిర్వహించిన 'అడవితల్లి బాట' కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఆ సందర్భంగా చాపరాయి నుంచి పెదపాడు వరకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం గ్రామంలో మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. అప్పుడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరిన స్కూలు భవనం స్థానంలో కొత్త భవనం అవసరమని ఉపాధ్యాయులు రంగయ్య పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సభావేదికపైనే కొత్త భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఇప్పుడు పెదపాడులో ఆధునిక సౌకర్యాలతో కొత్త పాఠశాల భవనం నిర్మాణం పూర్తైంది. ఈ భవనం 2026 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. విద్యా వాతావరణాన్ని మెరుగుపరచేలా మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. హామీ ఇచ్చిన సమయానికి పనులు పూర్తి కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధి కోసం చొరవ తీసుకున్న పవన్ కల్యాణ్‌కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# మరోసారి రెచ్చిపోయిన నేపాలి గ్యాంగ్..




- నగరంలో భారీ దోపిడీ
- 60 తులాల బంగారం, 25 కిలోల వెండి నగలు,రూ.35 వేల నగదు, 3వేల యూఎస్ డాలర్లు తస్కరణ
- కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్, మే 13 (వెలుతురు):**
హైదరాబాద్ నగరంలో నేపాలీ గ్యాంగ్ మరోసారి రెచ్చిపోయింది. మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జవహర్ నగర్ ఠాణా పరిధిలో భారీ చోరీకి పాల్పడింది. ఈ ఘటనలో 60 తులాల బంగారం, 25 కిలోల వెండి నగలు ,రూ.35 వేల నగదు, 3వేల యూఎస్ డాలర్లను తస్కరించింది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య తనుజాను నేపాలీ గ్యాంగ్ హత్య చేసిన కేసు దర్యాప్తులో ఉండగానే ఈ ఘటన నగరంలోనే జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ప్రొఫెసర్ దంపతుల చేతులు, కాళ్లు కట్టేసి మరీ చోరీ చేశారు. పూర్తిగా సినీ ఫక్కీలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి భారీ దోపిడీకి పాల్పడడం కలకలం సృష్టిస్తోంది. పోలీసులు,బాధితుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లోని కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్ లోని ఫ్లాట్ నెంబర్ 15 లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్(68),భార్య డాక్టర్ విజయలక్ష్మి(58) లు నివాసం ఉంటున్నారు. 13 రోజుల క్రితం ఓ నేపాలీ జంట వీరి దగ్గర పనిలో చేరారు. నమ్మకంగా పనిచేస్తూ వారితో సన్నిహితంగా మెలిగారు. ఇటీవలే మరో మహిళ వారి బంధువుగా పరిచయమై మెల్లగా ఇంట్లోకి వచ్చింది. సోమవారం రాత్రి నేపాలీ మహిళ పుట్టిన రోజు వేడుకలను ఇంట్లో చేసుకుంటామని ప్రొఫెసర్ దంపతులను అడగడంతో వారు అంగీకరించారు. పుట్టిన రోజు వేడుకల కోసం ఆ సమయంలో మరో ముగ్గురు ఇంట్లోకి వచ్చారు. దంపతులు రాత్రి భోజనం చేస్తుండగా నేపాలీ గ్యాంగ్ జన్మదిన వేడుకలను జరుపుకున్నట్లు నటించారు. కొద్ది సేపటికే వెనుక నుంచి వచ్చి దంపతులను బెదిరించి తాడులతో చేతులను కట్టేశారు. భయాందోళనకు గురైన వారు మమ్మల్ని ఏమి చేయకండి అంటూ మీకు ఏమీ కావాలో తీసుకోండి అని దంపతులు దయనీ పరిస్థితుల్లో వేడుకోవడంతో ఏలాంటి ప్రాణహాని చేయలేదు. అనంతరం మత్తు మందు కలిపిన పదార్థాలను వారి చేత బలవంతంగా తినిపించారు. తర్వాత గదిలోకి తీసుకెళ్లి ఇద్దరిని కట్టేశారు. ఇంట్లో ఉన్న బంగారం, వెండి,నగలతో నగదు, విదేశీ కరెన్సీతో ఆటోలో పరారయ్యారు. మత్తు మందు ప్రభావంతో దంపతులు మంగళవారం మధ్యాహ్నం వరకు అలాగే ఉన్నారు. దోపిడి సమయంలో ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అన్నిగేట్లకు పకడ్బందీగా తాళాలు వేసి దుండగలు పారిపోయినట్లు సమాచారం. మధ్యాహ్నం కాలనీలో ఇంటి వైపు వచ్చిన స్థానికులను గుర్తించిన ప్రొఫెసర్ కిటికీలో నుంచి అరవడంతో తలుపులు తీశారు. ఈ దోపీడిలో ఏడుగురు పాల్గొన్నట్లు తెలిసింది. స్థానికుల సహాయంతో జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దుండగలు దోపిడీకి పాల్పడి నేపాల్ పారిపోయినట్లు పోలీసులు తెలియజేస్తున్నారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు చెబుతున్నారు. బస్టాండ్ లు, రైల్వే స్టేషన్లలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# 45 ఏళ్ల తర్వాత ఇంటర్ పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు నేత దేవ్‌జీ

- కోరుట్లలో తెలుగు పరీక్షకు హాజరైన నేత
- 1980-82లో ఎంపీసీ చదివిన దేవ్‌జీ
- విద్యార్థి ఉద్యమాల సమయంలో పరీక్ష బహిష్కరణ
- ప్రజల కోసం న్యాయవాదిగా సేవ చేయాలన్న లక్ష్యం





**కోరుట్ల వెలుతురు మే 13:**

మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ జీవితంలో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. దాదాపు 45 ఏళ్ల తర్వాత ఆయన ఇంటర్‌మీడియట్ పరీక్షకు హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో బుధవారం నిర్వహించిన తెలుగు పరీక్షను ఆయన రాశారు. దేవ్‌జీ 198082 కాలంలో జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివారు. ఆ సమయంలో విద్యార్థి రాడికల్ యూనియన్‌లో చురుకుగా పని చేశారు. ఉద్యమ కార్యకలాపాల్లో భాగంగా రెండో సంవత్సరం తెలుగు పరీక్షను బహిష్కరించారు. అనంతరం పూర్తిస్థాయిలో మావోయిస్టు ఉద్యమంలో చేరి అండర్‌గ్రౌండ్ జీవితం గడిపారు. ఇటీవల ఆయన మావోయిస్టు ఉద్యమాన్ని వీడి సాధారణ జీవితంలోకి వచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అధికారుల సమక్షంలో జనజీవన స్రవంతిలో కలిసిన దేవ్‌జీ, విద్యను పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చారు. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతి ఇవ్వడంతో పరీక్ష రాసే అవకాశం లభించింది. బుధవారం కోరుట్లలోని ఓ కాలేజీలో తెలుగు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రానికి వచ్చిన దేవ్‌జీని పలువురు ఆసక్తిగా గమనించారు. వయస్సుతో సంబంధం లేకుండా విద్యను కొనసాగించాలనే తన నిర్ణయంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో న్యాయవాద కోర్సు పూర్తి చేసి పేదల కోసం పనిచేయాలని దేవ్‌జీ తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విధంగా తన జీవితాన్ని మలుచుకోవాలనుకుంటున్నానని చెప్పారు. గతాన్ని వెనక్కి వదిలి, విద్య ద్వారా కొత్త జీవితం ప్రారంభించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు.

# శ్రీవాణి దర్శన టికెట్ల బుకింగ్‌పై అపోహలు నమ్మొద్దు

- 2019 మేలో శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల బుకింగ్ విధానం ప్రారంభం
- భక్తుల సూచనలతో 2024 జూన్ నుంచి కొత్త విధానం అమలు
- బుకింగ్ సిస్టమ్ పూర్తిగా పారదర్శకంగా నిర్వహణ
- టికెట్ సైట్‌ను హ్యాక్ చేయడం అసాధ్యం అని తితిదే స్పష్టీకరణ
- ఆధునిక సాంకేతిక రక్షణ వ్యవస్థతో నిరంతర నిఘా
- ఏఐ ఆధారిత ఆటో ఫిల్లింగ్ ద్వారా దళారుల ప్రయత్నాలు గుర్తింపు
- అనుమానాస్పద ఐడీలను వెంటనే బ్లాక్ చేస్తున్న టీటీడీ సాంకేతిక విభాగం
- సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ భద్రతా చర్యలు
- నకిలీ టికెట్ల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- భక్తులు కేవలం అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుకింగ్ చేయాలని విజ్ఞప్తి




**తిరుపతి వెలుతురు మే 13:**

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి సంబంధించిన శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల బుకింగ్ విధానంపై సోషల్ మీడియా, కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలు, అనుమానాలు పూర్తిగా అవాస్తవమని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) స్పష్టం చేసింది. భక్తులు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని తితిదే విజ్ఞప్తి చేసింది.
తితిదే విడుదల చేసిన ప్రకటనలో, శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల బుకింగ్ విధానాన్ని 2019 మే నెలలో ప్రవేశపెట్టినట్లు తెలిపింది. అప్పటి నుంచి భక్తుల అనుభవాలు, సూచనలు, సలహాల ఆధారంగా వ్యవస్థలో అవసరమైన మార్పులు, మెరుగుదలలు చేస్తూ వస్తున్నట్లు పేర్కొంది. ముఖ్యంగా 2024 జూన్ నుంచి బుకింగ్ విధానాన్ని మరింత పారదర్శకంగా, బలమైన సాంకేతిక వ్యవస్థతో పటిష్ఠం చేసినట్లు తితిదే వెల్లడించింది. బుకింగ్ వ్యవస్థ భద్రతపై వస్తున్న ఆరోపణలను ఖండించిన తితిదే, శ్రీవాణి టికెట్ బుకింగ్ సైట్‌ను హ్యాక్ చేయడం లేదా వ్యవస్థలో చొరబడడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదని స్పష్టం చేసింది. బలమైన సైబర్ సెక్యూరిటీ వ్యవస్థతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపింది. అయితే, కొందరు దళారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ఏఐ ఆధారిత ఆటో ఫిల్లింగ్, ఆటో కాపీయింగ్ వంటి పద్ధతులను ఉపయోగించి వేగంగా వివరాలు నమోదు చేసి టికెట్లు బుక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని తితిదే పేర్కొంది. ఇలాంటి అనుమానాస్పద కార్యకలాపాలను తితిదే సాంకేతిక విభాగం ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే నియంత్రణ చర్యలు తీసుకుంటోందని తెలిపింది. అలాగే, అనుమానాస్పద ఐడీలను గుర్తించి బ్లాక్ చేయడం, అక్రమ బుకింగ్ ప్రయత్నాలను అడ్డుకోవడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని వివరించింది. సాఫ్ట్‌వేర్ వ్యవస్థను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ మరింత భద్రతను పెంచుతున్నట్లు తితిదే పేర్కొంది. ఇక కొంతమంది దళారులు భక్తులను తప్పుదోవ పట్టిస్తూ నకిలీ టికెట్లను విక్రయిస్తున్నట్లు గుర్తించిన తితిదే, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. భక్తులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, కేవలం అధికారిక టీటీడీ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే శ్రీవాణి టికెట్లు బుక్ చేసుకోవాలని స్పష్టంగా సూచించింది. మొత్తానికి, శ్రీవాణి దర్శన టికెట్ల బుకింగ్ వ్యవస్థ పూర్తిగా సురక్షితంగా ఉందని, ఎలాంటి హ్యాకింగ్ లేదా అక్రమ ప్రవేశానికి అవకాశం లేదని టీటీడీ మరోసారి భక్తులకు హామీ ఇచ్చింది.

## కొండగట్టు ఆలయంలో జై కేసీఆర్ నినాదాలు




- కనీస సౌకర్యాలు లేవని, గంటల తరబడి లైన్ లో వేచి ఉన్నామని స్వాముల ఆగ్రహం

**హైదరాబాద్, మే 13(వెలుతురు):**
కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తుల తాకిడి ఎక్కువైన నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కొండగట్టు ఆలయంలో జై కేసీఆర్ నినాదాలు చేశారు స్వాములు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయానికి వచ్చిన స్వాములకు కనీస సౌకర్యాలు లేవని, గంటల తరబడి లైన్ లో వేచి ఉన్నామని స్వాముల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవని గుర్తు చేసుకుంటూ జై కేసీఆర్ అంటూ స్వాములు నినాదాలు చేసినట్లు వీడియో వైరల్ గా మారింది. పుణ్యక్షేత్రం కొండగట్టులో భక్తుల రద్దీ కొనసాగుతోంది. కొండగట్టు దేవాలయంలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున అభిషేకం జరగగా, ఆ తర్వాత లక్ష పూలతో పాటు ఫలాలతో మూలవిరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ క్రమంలో కొండగట్టు అంజన్న సన్నిధికి వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారు. సోమవారం ప్రారంభమైన భక్తుల తాకిడి..బుధవారం వరకు కొనసాగనుంది.

## వలస కార్మికుల కోసం జాతీయ డ్యాష్‌బోర్డ్, డిజిటల్ వేతనాలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సూచనలు

- వేతన దోపిడీ నివారణకు డిజిటల్ చెల్లింపు - వ్యవస్థలు, రాష్ట్రాల మధ్య సమన్వయం బలోపేతంపై దృష్టి.
- వలస కార్మికుల హక్కుల రక్షణకు సమగ్ర సంస్కరణలు,
- పాలసీల్లో ప్రత్యక్ష ప్రాతినిధ్యం అవసరమని ఎన్‌హెచ్‌ఆర్‌సీ సూచనలు.



**న్యూఢిల్లీ, మే 13 (వెలుతురు ):**
వలస కార్మికుల హక్కులను రక్షించేందుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కీలక సూచనలు చేసింది. దేశవ్యాప్తంగా వారి కదలికలను ట్రాక్ చేయడానికి జాతీయ డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని, వేతన చెల్లింపులను పారదర్శకంగా చేయడానికి డిజిటల్ పేమెంట్ వ్యవస్థలను ప్రోత్సహించాలని సూచించింది. వలస కార్మికుల హక్కుల రక్షణపై నిర్వహించిన సమావేశంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ (రిటైర్డ్) వి. రామసుబ్రహ్మణియన్ అధ్యక్షత వహించారు. అసంఘటిత రంగంలో ఎక్కువగా పనిచేసే వలస కార్మికులు భాషా సమస్యలు, స్థిర నివాసం లేకపోవడం వంటి కారణాల వల్ల ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. చట్టాలు ఉన్నప్పటికీ అమలులో లోపాలు ఉన్నాయని, కేవలం నియమాల పాటించడం కాకుండా హక్కుల పరిరక్షణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రాల మధ్య సమన్వయం, సామాజిక భద్రత పథకాల పోర్టబిలిటీ, కార్మిక చట్టాల కఠిన అమలు అవసరమని సూచించారు. జిల్లా వారీగా వలస కదలికలను ట్రాక్ చేయడానికి డ్యాష్‌బోర్డ్, రాష్ట్రాల మధ్య సమన్వయం బలోపేతం, వివిధ ప్రభుత్వ డేటాబేస్‌లను అనుసంధానం చేయడం వంటి చర్యలు అవసరమని పేర్కొన్నారు. అలాగే కార్మికుల వేతనాలు నేరుగా డిజిటల్ ద్వారా చెల్లించడం వల్ల వేతన దోపిడీ తగ్గుతుందని చెప్పారు. వలస కార్మికులకు పాలసీల రూపకల్పనలో ప్రత్యక్ష ప్రాతినిధ్యం ఇవ్వాలని, వారి సమస్యలకు సమగ్ర పరిష్కారాలు తీసుకురావాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ సూచించింది.

## ములాయం సింగ్ యాదవ్ కుమారుడు ఆకస్మిక మృతి..!



- ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ప్రతీక్ యాదవ్ ఆస్పత్రికి తరలించేలోపే మృతి
- పోస్టుమార్టం కోసం అస్పత్రికి కి తరలింపు..
- శరీరంపై గాయాలేమీ లేవన్న వైద్యులు
- రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యాపారవేత్తగా గుర్తింపు తెచ్చుకున్న ప్రతీక్
- అపర్ణా యాదవ్‌తో విభేదాలు, విడాకుల ప్రకటన తర్వాతే విషాద ఘటన
- ప్రతీక్ మరణంతో యాదవ్ కుటుంబంలో విషాదం..
- సమాజవాద్ పార్టీ నేతల సంతాప సందేశాలు

**లక్నో, మే 13(వెలుతురు):**
సమాజ్ వాదీ పార్టీ (SP) వ్యవస్థాపకుడు, దివంగత నేత ములాయం సింగ్ యాదవ్ రెండో కుమారుడు ప్రతీక్ యాదవ్ (38) కన్నుమూశారు. బుధవారం తెల్లవారుజామున లక్నోలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన అకాల మరణంతో యాదవ్ కుటుంబంలో , రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. పోలీసుల సమాచారం ప్రకారం, బుధవారం ఉదయం 6:15 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ప్రతీక్ యాదవ్‌ను లక్నోలోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి చేరుకునేలోపే ఆయన మరణించారని, 'బ్రాట్ డెడ్'గా వైద్యులు ప్రకటించారు. ఆ సమయంలో ఆయన భార్య, బీజేపీ నేత అపర్ణా యాదవ్ అక్కడ లేరు. మరణానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ (KGMU) లో పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ప్రాథమిక పరిశీలనలో శరీరంపై ఎలాంటి గాయాలు కనిపించలేదు. అనారోగ్యంతో పోరాటం ప్రతీక్ యాదవ్ గత కొంతకాలంగా ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన ఊపిరితిత్తులలో రక్తం గడ్డకట్టడం వల్ల చికిత్స పొందుతున్నారు. బుధవారం ఉదయం ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించి, స్పందించడం మానేయడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినా ఫలితం దక్కలేదు. ఎవరీ ప్రతీక్ యాదవ్? ప్రతీక్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ , ఆయన రెండో భార్య సాధన దంపతుల కుమారుడు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌కు ఆయన సోదరుడు అవుతారు. యూకేలోని లీడ్స్ యూనివర్సిటీ నుండి ఎంబీఏ పూర్తి చేసిన ప్రతీక్, వ్యాపారవేత్తగా , రియల్ ఎస్టేట్ డెవలపర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. రాజకీయ కుటుంబంలో పుట్టినప్పటికీ, ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు ఎప్పుడూ దూరంగానే ఉన్నారు.
వ్యక్తిగత జీవితం , వివాహం ప్రతీక్ యాదవ్ , అపర్ణ యాదవ్ ఎనిమిదేళ్ల ప్రేమ తర్వాత 2011లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, ఇటీవల వీరి మధ్య కొన్ని విభేదాలు తలెత్తాయి. గత జనవరిలో తాము విడాకులు తీసుకోబోతున్నట్లు ప్రతీక్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తన మానసిక ఆరోగ్యం పట్ల అపర్ణ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కేవలం పేరు ప్రఖ్యాతుల కోసమే ఆమె పాకులాడిందని ఆయన అప్పట్లో ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆ విడాకుల ప్రక్రియ ముందుకు సాగలేదు.
రాజకీయాల పట్ల విముఖత యాదవ్ కుటుంబంలో దాదాపు అందరూ రాజకీయాల్లో ఉన్నప్పటికీ, ప్రతీక్ మాత్రం ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2012లో కొందరు పార్టీ కార్యకర్తలు ఆయనను అజంగఢ్ నుండి పోటీ చేయించాలని కోరినప్పటికీ, ఆయన ఆసక్తి చూపలేదు. రాజకీయ పదవుల కంటే తన వ్యాపారం , వ్యక్తిగత అభిరుచులకే ఆయన ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతీక్ మరణవార్త తెలుసుకున్న పలువురు నేతలు యాదవ్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.

# ఒత్తిడికి చిత్తవ్వొద్దు!




**అంతా ఒత్తిడికి గురయ్యేవాళ్లమే. సమయానికి పని పూర్తి కానప్పుడో, వేళకు రైలు స్టేషన్‌కు చేరనప్పుడో ఎంతో కొంత ఒత్తిడి సహజం. ఇది పనులు త్వరగా పూర్తి కావటానికి చోదకశక్తిగానూ పనిచేస్తుంది. కానీ తరచూ, అదేపనిగా ఒత్తిడికి లోనవటమే సమస్య. తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ఇది మానసిక, శారీరక సమస్యలకూ దారితీస్తుంది. కాబట్టి నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడికి చిత్తవ్వకుండా, దాన్ని ఎదుర్కొనే ధీరత్వం సాధించటం తక్షణావసరంగా మారింది.**

తొలిసారి ఇంటర్వ్యూకు హాజరైనప్పుడు ఎలా అనిపించిందో ఒకసారి గుర్తుతెచ్చుకోండి. గుండె దడదడమని కొట్టుకోవటం, ఒళ్లంతా చెమటలు పట్టటం గమనించే ఉంటారు. దీనికి కారణం మనసు, శరీరం ఒత్తిడికి గురికావటమే. నిజానికిది మానవ పరిణామక్రమంలో భాగంగానే మనకు అబ్బుతూ వచ్చింది. అప్పటి సంచార జీవనంలో ఎక్కడి నుంచి ఏ క్రూరమృగం దాడిచేస్తుందో, ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి. వీటిని ఎదుర్కోవటమో లేదా అక్కడి నుంచి పారిపోవటమో తప్ప మరో మార్గం లేదు. ఇలాంటప్పుడు ఒంట్లో స్వయంచాలిత ప్రతిస్పందన ప్రేరేపితమై అడ్రినలిన్, కార్టిసాల్ వంటి హార్మోన్లు పెద్ద ఎత్తున విడుదలయ్యేలా చేస్తుంది. దీంతో గుండె వేగం, రక్తపోటు, శక్తి, అప్రమత్తత పెరుగుతాయి. ఇవి ప్రమాదాల నుంచి త్వరగా బయటపడటానికి లేదా వాటిని ఎదుర్కోవటానికి తోడ్పడతాయి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులేవీ లేవు గానీ రోజూ బోలెడన్ని సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంటాం. ప్రాజెక్టు గడువు సమీపించటం, వేళకు ఆఫీసుకు చేరకపోవటం, ఇంటిఆఫీసు పనుల మధ్య సమన్వయం కుదరకపోవటం, పిల్లల సంరక్షణ వంటివన్నీ నిత్యం ఎదురయ్యేవే. సహజ రక్షణ వ్యవస్థ వీటిని కూడా ప్రమాదాలుగానే భావించి, అప్రమత్తంగా ఉండేలా చేస్తోంది. ఇది కొత్త పరిస్థితులకు సర్దుకుపోవటానికి, పనులు త్వరగా పూర్తి చేయటానికి తోడ్పడే మాట నిజమే. కానీ కొందరు దీన్ని తట్టుకోలేక, దీర్ఘకాలంగా ఇబ్బంది పడుతుంటారు.

## కారణాలేంటి?

- ఒత్తిడికి ఇదమిత్థమైన కారణాలంటూ ఏవీ లేవు. కొత్త, అనూహ్య పరిస్థితులను, సవాళ్లను ఎదుర్కోవటానికి దారితీసేవి ఏవైనా దీనికి కారణం కావొచ్చు. మచ్చుకు కొన్ని కారణాలు ఇవీ..
- దీర్ఘకాల జబ్బులు లేదా ఆత్మీయులను కోల్పోవటం
- విడాకులు తీసుకోవటం
- ఆర్థిక ఇబ్బందులు
- కొత్త ప్రాంతాలు లేదా ఇళ్లకు మారటం
- ఉద్యోగ విరమణ
- పరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరు కావటం
- స్నేహితులు, ఆత్మీయులతో వాగ్వాదం
- తక్కువ సమయంలో పనులు పూర్తి చేయాల్సి రావటం.



## చుట్టుముట్టే సమస్యలు

అదేపనిగా ఒత్తిడికి గురైతే ఆరోగ్యం దెబ్బతింటుంది. అప్పటికే ఉన్న సమస్యలు తీవ్రం కావొచ్చు.


- రోగనిరోధక వ్యవస్థ అస్తవ్యస్తం కావటం వల్ల కీళ్ల నొప్పులు, తీవ్ర నిస్సత్తువ, సొరియాసిస్ వంటి సమస్యలు తలెత్తొచ్చు.
- జీర్ణకోశ వ్యవస్థ ప్రభావితమై బరువు పెరగటం లేదా తగ్గటం, జీర్ణాశయంలో పుండ్లు, పేగు పూత వంటివి బయలుదేరొచ్చు.
- గుండె రక్తనాళాల వ్యవస్థ ప్రభావితమైతే అధిక రక్తపోటు, గుండె దడ ఇబ్బంది పెట్టొచ్చు.



- పునరుత్పత్తి వ్యవస్థ మీద పడే దుష్ప్రభావంతో జననాంగ ఇన్‌ఫెక్షన్లు, అండాశయాల్లో తిత్తులు, సంతానం కలగకపోవటం వంటి సమస్యలు బయలుదేరొచ్చు.
- మానసిక సామర్థ్యం తగ్గటంతో మితిమీరిన కోపం, ఇతరులను దూషించటం, అతిగా తినటం, మాదక ద్రవ్యాల అలవాట్లకు లోనవటం వంటి విపరీత పరిణామాలకు దారితీయొచ్చు. ఒత్తిడి తీవ్రమైతే ఆందోళన, కుంగుబాటు వంటి సమస్యలూ తలెత్తొచ్చు.

## మంచీ చెడూ

అన్నిసార్లూ ఒత్తిడి చేటు చేస్తుందనుకోవటానికి లేదు. మంచీ చేస్తుంది. పరీక్షలకు ముందు ఒత్తిడి మూలంగా బాగా చదువుకొని మార్కులు ఎక్కువ తెచ్చుకోవచ్చు. బాస్ తిడతాడనే



భయంతో మరింత త్వరగా, సమర్థంగా పనిచేయొచ్చు. ఇది మంచి రకం. కానీ అదే భయంతో చదవలేక, పరీక్షలు రాయలేక, పని చేయలేకపోతే చెడ్డ ఒత్తిడిగా పరిణమిస్తుంది. ప్రతికూల అంశాలే కాదు, కొన్నిసార్లు సానుకూల అంశాలూ ఒత్తిడిని కలగజేయొచ్చు. ఉదాహరణకు ఉద్యోగం రాకపోతేనే కాదు, ఉద్యోగం వచ్చిన తర్వాత ఆఫీసులో కొత్త వాతావరణానికి అలవాటు పడటమూ ఒత్తిడికి దారితీయొచ్చు. వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు సవాళ్లను ఎదుర్కోవాల్సి రావటమే దీనికి కారణం. పెద్ద విషయాలే కాదు, చిన్నవీ ఒత్తిడిని కలగజేయొచ్చు. ఆఫీసుకు చేరటం ఆలస్యమైందనుకోండి. రోజూ చేసే ఇంటి పనులు, పిల్లలను బడికి పంపటం, ట్రాఫిక్ జామ్ వంటి చిన్న చిన్న విషయాలూ పెద్ద సమస్యగా మారొచ్చు.

## ఒక్కొక్కరిలో ఒక్కోలా

ఒత్తిడి అందరిలో ఒకేలా ఉండదు. ఒక్కొక్కరిలో ఒక్కోలా కనిపిస్తుంటుంది. ఒకే సందర్భం ఒకరిని ఒత్తిడికి గురిచేస్తే, మరొకరికి మామూలుగానే అనిపించొచ్చు. ఇది వారి మానసిక, శారీరక ఆరోగ్యం, సామాజిక సంబంధాలు, ఆర్థిక దన్ను, అలవాట్ల వంటి రకరకాల అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు చాలాకాలంగా కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడేవారికి చిన్న ఒత్తిడైనా పెద్దగా తోస్తుంది. ఎందుకంటే వాళ్ల శక్తి అంతా నొప్పులను భరించటానికే సరిపోతుంది. అలాగే నలుగురితో కలివిడిగా ఉండేవారితో పోలిస్తే ఒంటరిగా ఉండేవారిలో ఒత్తిడి ఎక్కువ. వేళకు పడుకోవటం, ఆరోగ్యకరమైన ఆహారం తినటం, రోజూ వ్యాయామం చేసేవారి శరీరం ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోవటానికి సన్నద్ధంగా ఉంటుంది. అదే బద్ధకంగా గడపటం, మద్యం తాగటం వంటి అనారోగ్యకర అలవాట్లు గలవారు త్వరగా ఒత్తిడికి గురవుతుంటారు.

## లక్షణాలు రకరకాలు

ఒత్తిడికి ప్రత్యేక లక్షణమంటూ ఉండదు. ఇవి శారీరకంగా, మానసికంగా, అలవాట్లుప్రవర్తన పరంగానూ బయటపడుతుంటాయి.

**శారీరక లక్షణాలు:** తలనొప్పి, ఒళ్లు నొప్పులు, ఛాతీనొప్పి లేదా గుండెదడ, నిస్సత్తువ, నిద్ర సరిగా పట్టకపోవటం లేదా అతిగా నిద్రించటం, తల తేలిపోవటం, వణుకు, రక్తపోటు పెరగటం, కండరాల బిగువు, పళ్లు కొరకటం, జీర్ణ సమస్యలు, శృంగార సామర్థ్యం తగ్గటం, రోగనిరోధక వ్యవస్థ బలహీనం కావటం.

**మానసిక లక్షణాలు:** విచారం, బాధ, నిరాశ, చిరాకు, ఆందోళన, కుంగుబాటు, ఉన్నట్టుండి భయాలు పుట్టటం.

**ప్రవర్తన లక్షణాలు:** ఎక్కువ లేదా తక్కువగా తినటం, అతిగా మద్యం తాగటం, సిగరెట్లు కాల్చటం, జూదం ఆడటం, అనవసరంగా షాపింగ్ చేయటం, అదేపనిగా ఇంటర్నెట్ బ్రౌజింగ్, మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం.

దద్దు: కొందరికి ఒత్తిడి మూలంగా చర్మం మీద పొక్కులతో కూడిన దద్దు రావొచ్చు. దీంతో దురద, మంట, బాధ ఇబ్బంది పెడతాయి. ఇది మగవారిలో కన్నా ఆడవారిలో ఎక్కువ.

## ఎలా ఎదుర్కోవాలి?

**కారణాన్ని గుర్తించటం:** రోజంతా మానసిక స్థితి ఎలా ఉందో ఓసారి పరిశీలించుకోవాలి. ఒకవేళ ఒత్తిడికి గురైతే దానికి కారణమేంటి? అప్పటి ఆలోచనలేంటి? మానసిక స్థితి ఎలా ఉంది? అనేవి కాగితం మీద రాసుకోవాలి. కారణాన్ని గుర్తించాక, దాన్ని ఎదుర్కోవటానికి ప్రయత్నించాలి. సమంజసమైన అంచనాలను నిర్ణయించుకోవాలి.

**ప్రణాళికా బద్ధంగా:** రోజువారీ పనులైనా, ఆఫీసు వ్యవహారాలైనా ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ఆరోజు చేయాల్సిన పనుల జాబితాను రాసుకొని, ముఖ్యమైనవేంటో గుర్తించాలి. దీంతో హడావుడి పడకుండా అన్ని పనులు పూర్తి చేసుకోవచ్చు.

**కంటి నిండా నిద్ర:** రాత్రిపూట 7 నుంచి 9 గంటల సేపు నిద్రపోవాలి. ఒకవేళ నిద్రలేమితో ఇబ్బంది పడుతుంటే వేళకు పడుకోవటం, లేవటం.. వ్యాయామం చేయటం, రోజంతా చురుకుగా ఉండటానికి ప్రయత్నించాలి.

చింతించటం మానెయ్యాలి: కొన్ని పనులు మన చేతుల్లో ఉండవు. దాని అంగీకరించటం అలవాటు చేసుకోవాలి. వాటిని చేయనంత మాత్రాన ప్రపంచమేమీ మునిగిపోదని గుర్తించాలి. వాటి కోసం చింతించటం మానేసి, ప్రశాంతంగా ఉండటం అలవరచుకోవాలి.

**వీలైనంత మెరుగ్గా:** ప్రతి పనినీ ఫర్‌ఫెక్ట్‌గా చేయాలనే ఆలోచన పెట్టుకోవద్దు. ఏదీ పూర్తి ఫర్‌ఫెక్ట్‌గా ఉండదు. ఎంత చేసినా ఇంకా చేయటానికి ఎంతోకొంత అవకాశం ఉంటూనే ఉంటుంది. కాబట్టి వీలైనంత బాగా చేయటం మీద దృష్టి సారించండి. ఇతరులు ఏమనుకున్నా మీ కృషిని మీరే అభినందించుకోండి.

**సానుకూల దృక్పథం:** ప్రతికూల భావనలను పక్కకు పెట్టి, సానుకూల భావనలను పెంచుకోవాలి. అసాధ్యమని ముందే అనుకుంటే ఏ పనీ ముందుకు సాగదని గుర్తుంచుకోవాలి. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. 'నేను చేయగలను' అని ప్రయత్నిస్తే తప్పకుండా పురోగతి కనిపిస్తుంది. అనవసర ఒత్తిడికి అవకాశముండదు.

**నవ్వితే మేలు:** నవ్వు మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. బాధలను దూరం చేస్తుంది. వీలున్నప్పుడల్లా నలుగురితో జోక్స్ వేయటం, ఇతరులు వేసే జోక్స్‌కు మనసారా స్పందించటం మంచిది. నలుగురిలో ఉన్నా, ఒంటరిగా ఉన్నా గట్టిగా నవ్వటానికి భయపడకండి. నవ్వు తెప్పించే కథలు చదవటం, వీడియోలు చూడటం మేలు.

**బలమైన సంబంధాలు:** స్నేహితులు, బంధువులు ఇచ్చే భరోసానే వేరు. కష్టకాలంలో ఆదుకునే వారు తోడుగా ఉన్నారనే ఆలోచనే కొండంత బలాన్ని స్తుంది. కాబట్టి నలుగురితో కలి విడిగా ఉండటం, బలమైన సంబంధాలు కలిగుండటం తప్పనిసరి. సమయం దొరికినప్పుడల్లా బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి మాట్లాడటం, ప్రత్యక్షంగా కలవటం మంచిది.



**వ్యాయామ బలం:** శ్రమ, వ్యాయామంతో శరీరమే కాదు, మనసూ బలం పుంజు కుంటుంది. ఒత్తిడి తగ్గుముఖం పడుతుంది. అందువల్ల వ్యాయామాన్ని కష్టంగా భావించకుండా, ఇష్టపడి చేయటం అలవాటు చేసుకోవాలి.

సేవా కార్యక్రమాలు: ఇతరులకు సాయం చేయటం మనసుకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. కాబట్టి స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనటం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం వంటివి చేయాలి.

**యోగా, ధ్యానం:** రోజూ కొంత సమయాన్ని మానసిక ప్రశాంతత కోసం విధిగా కేటాయించు కోవాలి. యోగాసనాలు, ధ్యానం, ప్రాణా యామం వంటివి ఎంతో మేలు చేస్తాయి.

**చెడు అలవాట్లు వదలండి:** అతిగా మద్యం తాగటం, సిగరెట్లు కాల్చటం వల్ల రక్తపోటు పెరుగుతుంది. ఇది ఆందోళన, ఒత్తిడికి దారితీస్తుంది. కాబట్టి చెడు అలవాట్లకు దూరంగా ఉండటం చాలా ముఖ్యం.

**నేర్చుకోవటం:** ఎప్పుడూ ఏదో ఒక కొత్త పనినో, నైపుణ్యాన్నో నేర్చుకుంటూ ఉండాలి. ఇది మనసుకు కొత్త బలాన్ని ఇస్తుంది. వయసుతో నిమిత్తం లేకుండా బొమ్మలు గీయటం, మట్టితో బొమ్మలు చేయటం వంటి హాబీలు అలవరచుకోవటం మంచిది.

పెంపుడు జంతువులతోనూ ఒత్తిడిని అదుపులో ఉంచుకోవచ్చు, తగ్గించుకోవచ్చు.

## నిర్ధారణ-చికిత్స

ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ, రోజువారీ పనులు మామూలుగా చేసుకుంటున్నంత వరకూ దాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. తగు జాగ్రత్తలతో అదుపులో ఉంచుకోవచ్చు. కానీ ఇది రోజువారీ పనులను.. కుటుంబ, సామాజిక బంధాలను అస్తవ్యస్తం చేస్తున్నా.. ఇతరత్రా శారీరక, మానసిక సమస్యలకు దారితీస్తున్నా సమస్యాత్మకంగా పరిణమించినట్టే. ఇలాంటప్పుడు మానసిక నిపుణులను సంప్రదించటానికి వెనకాడొద్దు. సకాలంలో చికిత్స తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.



- ఒత్తిడి నిర్ధారణలో లక్షణాలు ప్రధానం. ఎలాంటి అనుభూతులు కలుగుతున్నాయి? ఎంత కాలం నుంచి ఉన్నాయి? నిద్ర, ఆకలి ఎలా ఉన్నాయి? రోజువారీ పనులు ఎలా చేసుకుంటున్నారు? అనేవి క్షుణ్నంగా పరిశీలిస్తారు. లక్షణాల తీవ్రతను బట్టి ఇది కేవలం మానసిక ఒత్తిడేనా? కుంగుబాటు, ఆందోళన వంటి సమస్యలేవైనా కారణమవుతున్నాయేమో చూస్తారు.
- తీవ్రతను బట్టి కౌన్సెలింగ్ సరిపోతుందా? మందులూ అవసరమా? అనేది నిర్ణయిస్తారు. కౌన్సెలింగ్‌లో ఒత్తిడికి దారితీస్తున్న పరిస్థితులను గుర్తించటాన్ని, వాటిని ఎదుర్కోవటాన్ని నేర్పిస్తారు. ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించటం, కంటి నిండా నిద్రపోయేలా, చెడు అలవాట్లను తగ్గించుకునేలా ప్రోత్సహిస్తారు.
- అవసరమైతే మందులు వాడాల్సి ఉంటుంది. వీరికి కుంగుబాటు, ఆందోళన తగ్గించే మందులు ఉపయోగ పడతాయి. కొందరికి ఆరు నెలలు మందులు వాడితే సరిపోవచ్చు. ఒత్తిడి త్రీవత తగ్గినా కూడా సమస్య మళ్లీ తిరగబెట్టకుండా కొంతకాలం మందులను కొనసాగించాల్సి ఉంటుంది. పూర్తిగా నయమయ్యాక మందుల మోతాదు తగ్గిస్తూ వస్తారు. మోతాదు తగ్గించిన తర్వాత ఇబ్బందులేమీ లేనప్పుడు పూర్తిగా ఆపేస్తారు.

# జ్యోతిష్కుడి నియామకంపై వెనక్కి తగ్గిన సీఎం విజయ్

- మిత్రపక్షాల ఒత్తిడికి తలొగ్గిన సీఎం విజయ్
- జ్యోతిష్కుడికి ఓఎస్డి పోస్టు రద్దు చేసిన తమిళనాడు ప్రభుత్వం
- శాస్త్రీయ దృక్పథం కావాలంటూ మిత్రపక్షాల ఆగ్రహం
- యువతకు ఏ సందేశం ఇస్తున్నారు?.. విజయ్‌ను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు





**హైదరాబాద్, మే 13 (వెలుతురు):** జ్యోతిష్కుడి నియామకంపై వెనక్కి తగ్గిన సీఎం విజయ్ తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన జ్యోతిష్కుడి నియామకంపై సీఎం విజయ్ వెనక్కి తగ్గారు. తన వ్యక్తిగత జ్యోతిష్కుడు రిక్కీ రాధన్ పండిట్ వెట్రివేల్‌ను ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ గా నియమించిన నిర్ణయాన్ని సీఎం విజయ్ రద్దు చేశారు. ఈ నిర్ణయం మిత్రపక్షాలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో తీసుకున్నట్లు తెలుస్తోంది. తమిళగ వెట్రి కళగం (టీవీకే ) ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న వీసీకే, సీపీఎం, సీపీఐ వంటి పార్టీలు ఈ నియామకాన్ని బహిరంగంగా తప్పుబట్టాయి. వీసీకే ఎమ్మెల్యే వాణి అర్సు మాట్లాడుతూ.. ప్రభుత్వం శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించాలని, జ్యోతిష్యాలాంటి మూఢనమ్మకాలకు ప్రాధాన్యం ఇవ్వకూడదని వ్యాఖ్యానించారు. సీపీఎం, సీపీఐ నేతలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజల డబ్బుతో జ్యోతిష్కుడికి ప్రభుత్వ హోదా ఇవ్వడం సరైన విధానం కాదని విమర్శించారు. డీఎండీకే నేత ప్రేమలత విజయకాంత్ కూడా ఈ అంశంపై స్పందించారు. "యువత మీపై నమ్మకం పెట్టుకుని ఓటు వేసింది. జ్యోతిష్కుడిని ప్రభుత్వ హోదాలో పెట్టడం ద్వారా యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు?" అంటూ సీఎం విజయ్‌ను ప్రశ్నించారు. ఈ వివాదం మరింత ముదరడంతో అసెంబ్లీలో ఫ్లోర్ టెస్ట్ అనంతరం సీఎం విజయ్ స్పందించారు. రాజకీయ పార్టీల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని ఈ నియామకాన్ని మళ్లీ పరిశీలిస్తామని చెప్పారు. అనంతరం వెట్రివేల్ నియామకాన్ని అధికారికంగా రద్దు చేశారు.

# పెళ్లి వాహనం బోల్తా.. బాలుడు మృతి, 19 మందికి గాయాలు

- మహబూబ్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- పెళ్లి వేడుక నుంచి తిరుగు ప్రయాణంలో యాక్సిడెంట్
- కొత్త కలెక్టరేట్ వద్ద అదుపుతప్పిన బొలెరో వాహనం
- డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన వాహనం
- ఘటనా స్థలంలోనే ఆరేళ్ల బాలుడు సాయి వర్షిత్ మృతి
- గాయపడిన 19 మంది ఆస్పత్రికి తరలింపు
- ముగ్గురి పరిస్థితి విషమం.. వైద్యుల సమాచారం
- చిన్నచింతకుంట మండలం దమాగ్నాపూర్ గ్రామానికి చెందిన కుటుంబాలు
- భూత్పూర్‌లో పెళ్లికి హాజరై తిరిగి వస్తుండగా ఘటన
- స్థానికుల సహాయంతో క్షతగాత్రుల రక్షణ చర్యలు
- ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు



**మహబూబ్‌నగర్ వెలుతురు మే 13:** మహబూబ్‌నగర్ జిల్లాలో పెళ్లి సంబరాలు విషాదంగా మారాయి. జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 19 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నచింతకుంట మండలం దమాగ్నాపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన 20 మంది బుధవారం ఉదయం బొలెరో వాహనంలో భూత్పూర్ మండలంలో జరుగుతున్న వివాహ కార్యక్రమానికి వెళ్లారు. వివాహ వేడుకను ముగించుకుని సంతోషంగా స్వగ్రామానికి తిరుగు ప్రయాణం ప్రారంభించారు. అయితే ప్రయాణం మధ్యలో మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలోని కొత్త కలెక్టరేట్ వద్ద వాహనం అదుపుతప్పింది. వేగంగా వస్తున్న బొలెరో ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టడంతో వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆరేళ్ల బాలుడు సాయి వర్షిత్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ప్రయాణికులకు గాయాలు కావడంతో రోడ్డుపై అరుపులు, ఆర్తనాదాలు వినిపించాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే సహాయానికి ముందుకు వచ్చి క్షతగాత్రులను వాహనాల ద్వారా సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో పలువురికి తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలు అయినట్లు సమాచారం. ఆస్పత్రి వర్గాల ప్రకారం, చికిత్స పొందుతున్న 19 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. వాహనం వేగం అధికంగా ఉండటం వల్లే డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే పూర్తి కారణాలు దర్యాప్తు తర్వాత వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వాహనం అదుపుతప్పడానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఈ ఘటనతో దమాగ్నాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పెళ్లి వేడుకలో పాల్గొని సంతోషంగా తిరిగి వస్తుండగా జరిగిన ఈ దుర్ఘటనతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. బాలుడి మృతితో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. రోడ్డు భద్రతా చర్యలు మరింత కఠినతరం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తరచూ జరిగే ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు..

# భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి మెగా గ్రోత్ కారిడార్లు కీలకం




- ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నగరాలకు ఔటర్ రింగ్ రోడ్లు, స్మార్ట్ అర్బన్ మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి
- రాబోయే ఎయిర్‌పోర్టుల్లో నీటి వనరులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలను ముందస్తుగా ప్లాన్ చేయాలి
- ఈవీ వాహనాలు, సోలార్ ఎనర్జీ, పునరుత్పాదక విద్యుత్ వినియోగంతో పట్టణాభివృద్ధి
- ట్రాఫిక్ నియంత్రణలో ఏఐ టెక్నాలజీ వినియోగం, స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పై నిపుణుల సలహాలు తీసుకోవాలి

**హైదరాబాద్ వెలుతురు మే 13:** నల్గొండయాదగిరిగుట్ట టెంపుల్ కారిడార్‌తో పాటు ఆదిలాబాద్ నుంచి బాసర వరకు టూరిజం కారిడార్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో మెగా గ్రోత్ కారిడార్ ప్రాజెక్టులపై బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నగరాలకు ఔటర్ రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాబోయే ఎయిర్‌పోర్టులకు అనుసంధానంగా రోడ్లు నిర్మించాలని సూచించారు. పట్టణాభివృద్ధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్టీపీలు, వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఖర్చు తగ్గింపుతో పాటు కాలుష్య నియంత్రణ కోసం ఈవీ వాహనాలను ప్రోత్సహించాలని, లీజుకు తీసుకునే వాహనాలు కూడా ఈవీలే ఉండాలని చెప్పారు. ప్రతి మున్సిపాలిటీలో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేసి పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ట్రాఫిక్ నియంత్రణలో ఏఐ సాంకేతికత వినియోగంపై నిపుణుల సలహాలు తీసుకోవాలని సీఎం తెలిపారు. నగరాల్లో రేడియేషన్ తగ్గించేందుకు మల్టీ యుటిలిటీ టవర్స్, ప్రతి చోట స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



నల్గొండయాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, ఆదిలాబాద్‌నాగోబాబాసరకడెం ప్రాంతాలను కలుపుతూ టూరిజం కారిడార్ అభివృద్ధి చేయాలని సూచించారు. అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధిని కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాలని చెప్పారు.మహబూబ్‌నగర్‌భూత్పూర్‌జడ్చర్ల, కొత్తగూడెంపాల్వంచసుజాతనగర్ ప్రాంతాలను కారిడార్‌లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. వచ్చే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రణాళికలు రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు.

# భారత ప్రభుత్వం జన గణన – 2027 ప్రక్రియను రెండు దశలలో చేపడుతోంది




**రంగారెడ్డి వెలుతురు మే 13:** భారత ప్రభుత్వం జన గణన - 2027 లో భాగంగా ఈ నెల 11వ తేదీ సోమవారం నుండి ప్రారంభమైన మొదటి దశ ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన యొక్క ప్రక్రియలో జిల్లా ప్రజలు, అధికారులు బాధ్యతగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం జన గణన - 2027 ప్రక్రియను రెండు దశలలో చేపడుతోందని అన్నారు. అందులో భాగంగా మొదటి దశలో మే 11 నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన చేస్తారని కలెక్టర్ వివరించారు. ఇండ్ల గణన కోసం 11.05.2026 నుండి 09.06.2026 వరకు మీ ఇంటి వద్దకు వచ్చే నమోదు అధికారికి అన్ని వివరాలు తెలియజేయాలని సూచించారు. జన గణన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలందరూ తప్పనిసరిగా ఇండ్ల గణనకు వచ్చే అధికారికి సరైన సమాచారాన్ని ఇచ్చి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఇండ్ల గణనలో అడిగే ముఖ్యమైన ప్రశ్నలు (Master Data Questions) ఇళ్లు మరియు కుటుంబానికి సంబంధించి మొత్తం 33 ప్రశ్నలు అడుగుతారు. వాటిలో ముఖ్యమైనవి:



నమోదు అధికారి అడిగే ప్రధాన ప్రశ్నలు (ముఖ్య ప్రశ్నలు)

1.ఇంటి వివరాలు (హౌసింగ్) ఇం టి నంబర్, గోడలు/పైకప్పు మెటీరియల్, సొంతమా/అద్దెక, గదుల సంఖ్య.

2. కుటుంబ వివరాలు (డెమోగ్రాఫిక్స్) మొత్తం సభ్యులు, యజమాని పేరు/లింగం, ఎస్సీ/ఎస్టీ/ఇతర కేటగిరి.

3. మౌలిక సదుపాయాలు (సౌకర్యాలు) త్రాగునీటి వనరు, మరుగుదొడ్డి (Latrine), వంట (LPG), విద్యుత్.

4. ఆస్తులు/అసెట్స్ (ఆస్తులు) ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, టెలివిజన్, ద్విచక్ర/నాలుగు చక్రాల వాహనాలు.

మీరు ఆన్‌లైన్‌లో (స్వీయ గణన) వివరాలను విజయవంతంగా నమోదు చేసినప్పటికీ, ప్రభుత్వ ఎన్యూమరేటర్ (గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది లేదా టీచర్) భౌతికంగా మీ ఇంటికి వస్తారు. అప్పుడు మీరు ఆన్‌లైన్ ద్వారా పొందిన 'SE ID' నంబర్‌ను వారికి చూపిస్తే సరిపోతుంది. వారు తమ డివైజ్‌లో మీ వివరాలను క్రాస్‌వెరిఫై చేసి ఫైన కన్ఫర్మేషన్ ఇస్తారని తెలిపారు. ఎన్యుమరేటర్లు ఇండ్ల గణన ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇండ్ల గణనకు వచ్చే అధికారికి సరైన సమాచారాన్ని అందించి సహకరించాలని కలెక్టర్ జిల్లా ప్రజలను కోరారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com